



ఉమ్మడి జిల్లాకు
బుల్లెట్ రైళ్లు
350 కి.మీ. వేగాన్ని తట్టుకునేలా రైలు మార్గం
● వివరాలు 7లో...

రైతుకు ముసురు భయం

జడివానకు తడిసిన మొక్కజొన్న

అల్పపీడన ప్రభావంతో విస్తారంగా వర్షం

ఉమ్మడి జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం

తడిసిపోతున్న మొక్కజొన్న ధాన్యం

రంగు మారితే రైతులకు భారీ నష్టం



గార్లదిన్నె సమీపంలో ఆరబోసిన మొక్కజొన్న ధాన్యం తడవకుండా టార్పాలిన్ పట్టలు కప్పిన రైతులు

(న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి) అల్పపీడన ప్రభావంతో ఉమ్మడి జిల్లాను ముసురు కమ్ముకుంది. దాదాపు అన్ని మండలాల్లో మంగళ వారం వర్షం కురిసింది. ఆకాశం బుధ వారం ఉదయం నుంచి మేఘావృత మైంది. అనంతపురం, యాడికి, గార్ల దిన్నె, నార్పల మండలాల్లో బుధ వారం మోస్తారు వర్షం కురిసింది. పుట్లూరు, విడపనకల్లు, తాడిపత్రి, పామిడి తదితర మండలాల్లో చిరుజ ల్లులు పడ్డాయి. అత్యధికంగా ఆత్మకూ రులో 3.9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఉరవకొండ 3.5, బెళు గుప్ప 3, గుంతకల్లు 2.1, డి.హీరేహాళ్, విడపనకల్లు 2.0, నార్పల 1.7, బొమ్మ నహాళ్, గుత్తి 1.3 సెంటీమీటర్ల వర్ష పాతం నమోదైంది. మిగతా మండ లాల్లో 1.1 సెంటీమీటర్లలోపు వర్ష పాతం నమోదైంది.

భారీ వర్షాలకు అవకాశం

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఉమ్మడి జిల్లాలోని ఒకటి రెండు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విశాఖ వాతావరణ కేంద్రం హెచ్చరించినట్లు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతా వరణ శాస్త్రవేత్త గుత్తానారాయణ స్వామి తెలిపారు. ఈ అల్పపీడనం పశ్చిమ వాయువ్య దిశలో పయనించి, వాయుగుండంగా మారుతుందని తెలి పారు. ఈ సమయంలో పలు చోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం, ఉరు ములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపారు. పలు చోట్ల గంటకు 25 కి.మీ. నుంచి 30 కి.మీ. వేగంతో గాలులు వీచే అవ కాశం ఉందన్నారు. రైతులు

(మిగతా 6వ పేజీలో...)



అనంతపురంలో వర్షంలో తడుస్తూ వెళుతున్న వాహనదారులు, పాదచారులు



అనంత శివారులో మేఘావృతమైన ఆకాశం

ప్రతి ఇంటికి నీరిస్తాం

రూ.7.48 కోట్లతో ఆరు గ్రామాల తాగునీటి సమస్య పరిష్కారం

ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

తాగు నీటి ట్యాంకుల ప్రారంభం



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి పయ్యావుల కేశవ్

విడపనకల్లు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటికి తాగునీరు ఇవ్వడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. మండలంలోని హావళిగి, పాల్తూరు, గ్రామాల్లో తాగు నీటి ట్యాంకులను మంత్రి బుధవారం ప్రారంభించారు. మంత్రిని గ్రామస్థులు గజమాలలతో ఘనంగా సత్కరిం చారు. ఈ సందర్భంగా హావళిగి గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి పయ్యావుల కేశవ్ మట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా ఆరు గ్రామాలకు ఉన్న తాగు నీటి సమస్యను తీర్చిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుం దని అన్నారు. ఉరవకొండ నియోజక వర్గంలో ప్రజలకు తాగు, సాగు నీటి సమస్యలు ఉండకూ డదని, ప్రతి ఇంటికి మంచి నీరు అందిస్తామని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వంలో సాగునీటి కోసం రైతులు ఎన్నో పోరాటాలు చేసినా చుక్క నీరు ఇవ్వలేదని, ఆ నాయకులు కూడా మాట్లా డడం విడ్డూరంగా ఉందన్నారు. విడపనకల్లు మండలంలో ఆరు గ్రామాలకు తాగు నీరు అందించేందుకు రూ. 7.48 కోట్లతో పైప్‌లైన్ పనులు చేయించామని తెలిపారు. కార్యక్ర మంలో టీడీపీ నాయకులు చిన్న మారయ్య, కాలువ మారయ్య, గడ్డం మార య్య, ప్రతాప్‌నా యుడు, బద్రీనాథ్‌రెడ్డి, వన్నూరుస్వామి, కుమా రుస్వామి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు కోసం మహిళల వినతి

సరిహద్దులో ఉండడం వల్ల తమకు ఉచిత బస్సు అవకాశం లేకుండా పోతోందని హావళిగి గ్రామ మహిళలు మంత్రికి విన్నవించారు. దీంతో కేశవ్ మాట్లాడుతూ.. విడపనకల్లు మం డలం కర్ణాటక సరిహద్దులో ఉండటంతో కొద్దిగా సమస్యలు ఉన్నాయని, ప్రభుత్వ పెద్దలతో చర్చించి మండలంలోని మహిళలకు కూడా ఉచిత బస్సు సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తా అన్నారు. అనంతరం ఇంటింటికి వెళ్లి మహిళలు, వృద్ధులతో సమస్యలు అడిగి తెలు సుకున్నారు. కార్యక్రమంలో నాయకులు భీమ లింగప్ప, సీతా రాముడు, అమరేంద్ర, దేవేంద్ర, రవీంద్ర, హనుమంతు, చంద్ర, రాజు, జనార్దన నాయుడు, తిప్పారెడ్డి, వన్నూరుస్వామి, గంగన్న తదితరులు పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న కేశవ్

కార్తీకం.. శివోహం..!

పరమశివుడికి ప్రీతిపాత్రమైన ఆధ్యాత్మిక మాసం.. కార్తీకం వచ్చేసింది. ఉమ్మడి జిల్లాలోని శివాలయాలలో బుధవారం వేకువజామునే భక్తుల సందడి మొదలైంది. కార్తీకమాసం ఆరంభ సూచికగా అనంతపురం నగరంలోని మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఆకాశ దీపాన్ని వెలిగించారు. బెంగళూరు రోడ్డులోని శివకోటి దేవాలయం, శారదా నగర్‌లోని శృంగేరి శంకరమఠం, పాతూరులోని విరూపాక్షేశ్వర దేవాలయం, బసవేశ్వర స్వామి ఆలయం, అశోక్ నగర్‌లోని హరిహర దేవాలయం, హెచ్చెల్సీ కాలనీలోని చాముండేశ్వరి ఆలయం, మంజునాథస్వామి ఆలయం, ఆర్‌రోడ్డులోని అమృతలింగేశ్వరాలయం, అరవింద నగర్‌లోని సర్వేశ్వరాలయం తదితరచోట్ల భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.

-ఆంధ్రజ్యోతి, అనంతపురం టౌన్





మొదటిరోడ్డు శివాలయంలో కాశీవిశ్వేశ్వర స్వామి



నంది కొమ్ముల నడుమ కనిపించు స్వామీ..



అందరి జీవితాలు.. ఇలా వెలిగిపోవాలి స్వామీ..

పథకాలపై రైతులకు

శిక్షణ ఇవ్వాలి

● కలెక్టర్ ఆనంద్



అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ, అనుబంధ రంగాల్లో అమలవుతున్న పథకాలు, కార్యక్రమాలపై రైతులకు విస్తృతంగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆనంద్.. సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.... వ్యవసాయ, ఉద్యాన, అనుబంధ శాఖల అధికారులు.. రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కంట్రోల్ రూం ఏర్పాటు చేసి, క్షేత్ర స్థాయిలో కార్యక్రమాలను అక్కడి నుంచి పర్యవేక్షించాలన్నారు. యూరియా పంపిణీకి సంబంధించి అవసరమున్న చోట సరఫరా చేసి పంపిణీ చేయాలన్నారు. అనంత హార్టికల్చర్ కాన్‌క్లేవ్‌లో కొన్ని కంపెనీలు ఎంఓయూలు చేసుకున్నాయనీ, వాటి ప్రతినిధులతో నెలకోసారి మాట్లాడాలని, ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం అందిస్తామని తెలియజేయాలన్నారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా చీనీ పంటలో నూతన వంగడాల సాగును ప్రోత్సహించాలన్నారు. రైతులు పండించిన ఉద్యాన పంటలకు మంచి ధర వచ్చేలా చూడటం, ఇతర పంటల సాగును ప్రోత్సహించడంపై ప్రణాళిక రూపొందించాలన్నారు. ప్రకృతి వ్యవసాయం కింద వచ్చే నాలుగేళ్లలో చేపట్టాల్సిన కార్యాచరణ ప్రణాళికను తయారు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, ఉద్యాన శాఖ అధికారి ఉమాదేవి, ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు ప్రజలు సహకరించాలి

● ఎస్పీ జగదీష్ పిలుపు

● పామిడి, గుత్తి స్టేషన్ల తనిఖీ

పామిడి/గుత్తి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల విషయంలో పోలీసులకు ప్రజలు సహకరించాలని ఎస్పీ జగదీష్ పిలుపునిచ్చారు. బుధవారం పామిడి, గుత్తి పోలీసుస్టేషన్లను ఆయన తనిఖీ చేశారు. పామిడిలో నేరాల నమోదుపై సమీక్షించారు. రోడ్డు ప్రమాదాలకు గల కారణాలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలను సూచించారు. పలు రికార్డులను పరిశీలించారు. క్రైమ్ రేట్ బాగా తగ్గడంపై సీఐ యుగంధర్ పనితీరుపై సంతృప్తి వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజల సహకారంతో చోరీల నివారణ సాధ్యమవుతుందన్నారు. ఇళ్లకు తాళం వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎస్పీ జగదీష్ వచ్చిన విషయం తెలుసుకున్న టీడీపీ నీయకులు అక్కడికి చేరుకుని ఆయనను సన్మానించారు. టీడీపీ నాయకులు ప్రభాకర్ చౌదరి, బొల్లు శ్రీనివాస రెడ్డి, జింకల సంజీవకుమార్, సురేష్‌రెడ్డి, మహమ్మద్ రఫీ, లక్ష్మీనారాయణ, రామాంజనేయులు, ఆనంద్, వెంకటేష్, ప్రతాప్ పాల్గొన్నారు. అనంతరం గుత్తి పోలీసుస్టేషన్‌ను ఎస్పీ జగదీష్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను ఆయన పరిశీలించారు. పట్టణంలో పోలీస్ శాఖకు సంబంధించిన స్థలాలను వాణిజ్య పరంగా వినియోగిస్తాం అన్నారు. కార్యక్రమంలో గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు యుగంధర్, మస్తాన్, రామారావు, ఎస్ఐలు రవిప్రసాద్, సురేష్‌బాబు, నాగప్ప పాల్గొన్నారు.



పామిడిలో విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ జగదీష్



టిడ్కో గృహాలపై
కదలిక..!
● వివరాలు 7లో...

సెక్టోరల్స్ ఎంపికపై మళ్లీ వివాదం
విచారణకు కమిటీని నియమించిన కలెక్టర్
7



ముసురు భయం

వంద క్వింటాళ్ల ధాన్యం..



మూడు ఎకరాల్లో మొక్క జొన్న సాగు చేశాను. విత్తనం ఆరబెట్టుకుని బళ్లారి మార్కెట్‌కు తీసుకెళ్లి విక్రయించాలని భావించాను. వర్షానికి వంద క్వింటాళ్ల ధాన్యం తడిసిపోయింది. మళ్లీ ఆరబెట్టుకునేందుకు నానా తిప్పలు పడుతున్నాము. నెల క్రితం క్వింటం ధర రూ.2500 వరకూ పలికింది. ఇప్పుడు రూ.1700 అన్నా కొనేవారు లేరు. తడిసిన పంటను ఏ వ్యాపారీ ముట్టుకోడు. వాళ్లు ఎంతకి అడిగితే అంతకు ఇవ్వాల్సిందే. నాకు రూ.1.5లక్ష నష్టం వచ్చింది. పెట్టుబడి కూడా రాదు.

- దశరథరెడ్డి, హావళిగి

ఈ కష్టం పగవాడికి కూడా వద్దు..



మూడు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాను. కంకిని మిషన్‌కు ఆడించి విత్తనాన్ని ఆర బెట్టుకున్నాను. రెండు రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నాయి. కింద, పైన టార్పాలిన్ కప్పినా ఫలితం కనిపించడం లేదు. అరగంట ఆరబెడితే చాలు వర్షం మొదలౌతోంది. ధాన్యాన్ని ఎలా కాపాడుకోవాలో అర్థం కావడం లేదు. ఈ కష్టం పగవారికి కూడా రాకూడదు. దాదాపుగా 90 క్వింటాళ్ల ధాన్యం తడిసిపోయింది. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి.

-నరసింహా రెడ్డి, హావళిగి

(5వ పేజీ తరువాయి)

అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

తడిసిన మొక్కజొన్న

గార్లదిన్నె మండలంలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మొక్కజొన్న పంట దెబ్బతింటోంది. గార్లదిన్నె, కల్లూరు, సిరివరం, బూదేడు, కృష్ణాపురం, యర్రగుంట్ల, సంజీవపురం, మర్తాడు, కొట్టాలపల్లి, అంకంపేట, గుడ్డాలపల్లి తదితర గ్రామాల్లో సుమారు 600 మంది దాదాపు 1600 ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగుచేశారు. పంట కోతకు వచ్చింది. ఈ సమయంలో జడివానలు కురుస్తుండటంతో రైతులు కోత కోయాలంటే భయపడుతున్నారు. ఇప్పటికే కోత కోసి, కల్లాలు, జాతీయ రహదారి పక్కన ఆరబోసిన ధాన్యం తడిసిపోతోంది. కాపాడుకునేందుకు రైతులు ఉరుకులు పరుగులు తీయాల్సి వస్తోంది. ధాన్యంపై టార్పాలిన్ పట్టలు కప్పడంతోగాలి, వెలుతురు సోకక గింజల రంగు నల్లగా మారుతోంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

50 టన్నుల ధాన్యం..

విడపనకల్లు మండలంలోని హావళిగి, గడేకల్లు, ఆర్ కొట్టాల, ఉండబండ, చీకలగురికి, పొలికి, అంచనహాలు గ్రామాల్లో మొక్కజొన్న ధాన్యం తడిసి ముద్దైంది. గడేకల్లులో 67వ జాతీయ రహదారికి ఇరువైపులా అర కిలోమీటరు వరకూ మొక్కజొన్న ధాన్యాన్ని ఆరబెట్టారు. హావళిగి పాఠశాల మైదానంలో వంద మందికి పైగా రైతులు ధాన్యాన్ని ఆరబెట్టారు. విత్తనం తడవకుండా కింద, పైన టార్పాలిన్‌లు కప్పి ఉంచారు. కానీ భారీ వర్షాల కారణంగా నీరు లోపలికి వెళుతోంది. తడిసిన ధాన్యాన్ని రైతులు బకెట్లలో నింపి బయట మరోచోట ఆరబోస్తున్నారు. టార్పాలిన్‌పై నిలిచిన వర్షపు నీటిని బట్టలలో అద్ది బకెట్లలో పిండి ఎత్తిపోస్తున్నారు. మండలంలో 50 టన్నులకు పైగా మొక్కజొన్న ధాన్యం తడిసిపోయింది. రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.



విడపనకల్లు మండలంలో వర్షానికి తడిసిన మొక్కజొన్న ధాన్యం



మొక్క జొన్న ధాన్యాన్ని ఆరబోస్తున్న రైతులు

అప్పులు తీరుతాయనుకుంటే..



గార్లదిన్నెలో 9 ఎకరాల భూమిని రూ.2 లక్షలకు కౌలుకు తీసుకుని మొక్కజొన్న పంట సాగుచేశాను. ఎకరానికి రూ.40 వేల వరకూ పెట్టుబడి పెట్టాను. దిగుబడి బాగా వచ్చింది. అప్పులు తీరుతాయని సంతోషపడ్డాం. కానీ ఆరబెట్టిన ధాన్యం వర్షానికి తడిసిపోయింది. రంగు మారితే ధర పలకదు.

- రామాంజనేయులు, సిరివరం

ధర తగ్గించారు..



మూడు ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగుచేశాను. పంటకోసి ఆరబోశాం. వర్షానికి మొత్తం తడిసిపోతోంది. టార్పాలిన్ పట్టలు కప్పినా ఫలితం కనిపించడం లేదు. గింజలు తడిస్తే వ్యాపారులు కొనుగోలు చేయరు. మొన్నటి వరకు క్వింటం ధర రూ.2,200 ఉండేది. ఇప్పుడు రూ.1,800 ఇస్తామంటున్నారు.

- గోపాల్, సిరివరం

ఆదుకోవాలి..



ఏ పంట సాగు చేసినా నష్టం వస్తోంది. అందుకే మొక్కజొన్నతో మేలు జరుగుతుందని రైతులందరం ఆసక్తి చూపించాము. వర్షానికి పంట దెబ్బతినింది. రూ.లక్ష వెచ్చించి 3 ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగుచేశాను. కోత సమయంలో వర్షాలు పడుతున్నాయి. మా అవస్థలు అన్నీ ఇన్నీ కావు. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి.

- గంగాధర్, సిరివరం

ధర్మవరంలో తనిఖీలు

- ఎస్పీ ఆధ్వర్యంలో సోదాలు
- 85 ద్విచక్రవాహనాలు, 4 ఆటోలు సీజ్

ధర్మవరం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఎస్పీ, ఇద్దరు డీఎస్పీలు, 8 మంది సీఐలు, 10 మంది ఎస్ఐలు, 156 మంది సిబ్బంది ఒక్కసారిగా తనిఖీలకు దిగడంతో ధర్మవరం దద్దరిల్లింది. పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో ధర్మవరం, పెనుకొండ డీఎస్పీలు హేమంత్‌కుమార్, నరసింగప్ప, సీఐలు, ఎస్ఐలతో కలిసి ఎస్పీ సతీష్‌కుమార్ బుధవారం సోదాలు నిర్వహించారు. ప్రతి ఇంటినీ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. నేర చరిత్ర ఉన్నవారికి ఎస్పీ గట్టి హెచ్చరికలు జారీ చేశారు. రౌడీషీటర్ల ఇంటికి వెళ్లి వారి కుటుంబసభ్యులతో మాట్లాడి మంచి ప్రవర్తనలో నడుచుకునే విధంగా బాధ్యత తీసుకోవాలని సూచించారు. తుపాకులు కలిగి ఉన్నారన్న సమాచారంతో ప్రతి ఇంటినీ సోదా చేశారు. నంబరు ప్లేట్లు, రికార్డులు లేని వాహనాలను సీజ్ చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ... కార్డెన్ సెర్చ్‌లో భాగంగా ఎవరూ తప్పించుకోకుండా 16 బృందాలు ఏర్పాటుచేసి, రెండు డ్రోన్ కెమరాలు, బాడీవన్ కెమెరాలు, మొబైల్ స్కానింగ్ చెక్ డివైజ్‌లను వినియోగించామన్నారు. మొబైల్ స్కానింగ్ ఫింగర్ ప్రింట్ డివైజ్‌లు వినియోగించి, పాత నేరస్తుల డేటా సేకరించామన్నారు. ఆరుగురు రౌడీషీటర్లు, 8 మంది సస్పెక్ట్ షీట్లు కలిగిన వారిని గుర్తించి పరిశీలించామన్నారు. 25 ఏళ్ల క్రితం నేరాలు చేసిన వారు కూడా కాలనీలో ఉన్నారన్నారు. ప్రశాంతంగా బతకాలని వారికి సూచించామన్నారు. 15ఏళ్లుగా ప్రశాంత జీవనం సాగిస్తున్న వారిపై రౌడీషీట్లను తొలగిస్తామన్నారు. రాత్రి సమయాల్లో తాగి గొడవలు, అల్లర్లు చేసి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై రౌడీషీట్లు తెరుస్తామన్నారు. నంబర్ ప్లేట్లులేని 85 ద్విచక్రవాహనాలు, 4 ఆటోలను సీజ్ చేశామన్నారు. ఇందిరమ్మ కాలనీలో 4 సీసీ కెమెరాలు ప్రస్తుతానికి ఉన్నాయనీ, మరో 10 ఏర్పాటు చేస్తామని ఎస్పీ తెలిపారు.



ప్రజలతో మాట్లాడుతున్న ఎస్పీ

నిర్లక్ష్యంపై చర్యలు తప్పవ్

పీఏసీఎస్ అధికారులపై ఎమ్మెల్యే పరిటాల సునీత అసంతృప్తి

అనంతపురం రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): విస్తృతస్థాయి సమావేశానికి పూర్తి సమాచారంతో కాకుండా నిర్లక్ష్యంగా వస్తే చర్యలు తప్పవని కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి పరిధిలోని సొసైటీల సీఈఓలు, బ్యాంకుల అధికారులు, ఉద్యోగులపై ఎమ్మెల్యే పరిటాల సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు. పద్ధతి మార్చుకోవాలని సూచించారు. బుధవారం మండలంలోని ఆర్ కన్వెన్షన్ హాల్‌లో రాప్తాడు నియోజకవర్గ పరిధిలోని పీఏసీఎస్‌ల పాలకవర్గం, సంఘం సిబ్బంది, ఏడీసీసీ బ్యాంకు మేనేజర్లు, సూపర్‌వైజర్ల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్యే పరిటాల సునీత, ఏడీసీసీ బ్యాంకు ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, డీసీఎంఎస్ ఛైర్మన్ నెట్టెం వెంకటేష్ హాజరయ్యారు. సొసైటీల సీఈఓలు తమ పరిధిలోని రైతులు, రుణాలు, ఇతరత్రా వాటి గురించి తెలియజేశారు. ఇందులో కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లికి సంబంధించిన అధికారులు సరైన వివరాలు వెల్లడించకపోవడం పట్ల ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతులకు పంట రుణాలు ఇచ్చేందుకు కూడా అధికారులు నిబంధనలు అంటూ అడ్డు చెబుతున్నారని పలువురు సొసైటీల ఛైర్మన్లు ప్రస్తావించారు. వైసీపీ హయాంలో అక్రమంగా ఇచ్చిన రుణాలపై విచారణ చేయాలన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏడీసీసీ బ్యాంకు ఛైర్మన్ ముట్టిమండుగు కేశవరెడ్డి మాట్లాడుతూ.. వైసీపీ హయాంలో అనువుగాని చోట గోదాములు కట్టారన్నారు. కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చడానికే వాటిని నిర్మించారన్నారు. అవన్నీ బ్యాంకులకు భారంగా మారాయన్నారు. కొండగుట్టల్లో కడితే వాటిని ఎలా వినియోగించుకోవాలో అర్థంకావట్లేదన్నారు. త్వరలోనే వన్‌టైం సెటిల్‌మెంట్ అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంకు సీఈఓ సురేఖ, డీజీఎం రాంప్రసాద్, రాప్తాడు నియోజకవర్గంలోని సింగిల్ విండో అధ్యక్షులు లక్ష్మీనారాయణ, పాముదాయి రఘు, కృష్ణమోహన్ చౌదరి, నరసింహులు, నెట్టెం వెంకటేశ్వర్లు, ముత్యాలు, గోపాల్, లింగన్న, బ్రహ్మానందరెడ్డి, కన్వీనర్లు జింకా సూర్యనారాయణ, కొండప్ప, శ్రీనివాసులు, ముత్యాలురెడ్డి, సీనియర్ నాయకులు రామ్మూర్తినాయుడు, సుధాకర్‌నాయుడు, రంగయ్య, దండు ఓబులేసు, వేణుగోపాల్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

నెట్టికంటి ఆలయంలో హనుమద్దీక్షలు

గుంతకల్లు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కార్తీక పాడ్యమి తిథిని పురస్కరించుకుని కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో భక్తులు హనుమద్దీక్షలను చేపట్టారు. ప్రతి సంవత్సరం హనుమద్ మాలను ధరించే భక్తులు కసాపురం ఆలయానికి వచ్చి కార్తీక మాస ప్రారంభ తిథిన మండల దీక్షలు, ఇరభై రోజుల తర్వాత అర్ధ మండల దీక్షలను స్వీకరిస్తారు. ఈ మేరకు బుధవారం ఉదయం వేకువజామునే కాషాయ వస్త్రాలను ధరించి కసాపురం ఆలయానికి వచ్చిన భక్తులచే ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా హనుమద్ మాలలను తొడిగి, మంత్రోపదేశం చేసి హనుమద్దీక్షలను ప్రారంభించారు. దీక్షలను చేపట్టిన భక్తులు ప్రదక్షిణలు చేసి, స్వామి సన్నిధిలో భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. నవంబరు 11వ తేదీన అర్ధ మండల దీక్షా కార్యక్రమాన్ని ఆలయంలో నిర్వహించనున్నారు. కసాపురం దేవస్థానంతోపాటు, వివిధ ఆలయాల్లో మండల, అర్ధ మండల దీక్షలు చేపట్టిన మాలాధారులు డిసెంబరు 2వ తేదీన ఇరుముడులతో నెట్టికంటి సన్నిధికి తరలివస్తారు. డిసెంబరు 3న దేవస్థాన ప్రాంగణంలో చేపట్టే హనుమద్ వ్రతంలో పాల్గొని మాలలను విసర్జించి, దీక్షలను విరమిస్తారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

ప్లేస్‌మెంట్స్ కోసం ఎదురుచూపు..!

ఉద్యోగోన్నతులు వచ్చినా తప్పని నిరీక్షణ

మిగిలిన జిల్లాల్లో ముగిసిన ప్రక్రియ

సీనియార్టీ కోల్పోతామని ఉద్యోగుల ఆందోళన

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగోన్నతులు కల్పించినా.. ప్లేస్‌మెంట్స్ కోసం పంచాయతీరాజ్‌శాఖ ఉద్యోగులు ఎదురు చూస్తున్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఇప్పటికే ప్రక్రియ ముగించడంతో వారికంటే సీనియర్లుగా ఉన్నవారు తదుపరి ఉద్యోగోన్నతుల్లో జూనియర్స్ అయిపోవాల్సి వస్తోందని మదనపడుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని పలువురు గ్రేడ్-1 కార్యదర్శులతో పాటు వీడీఓ (విలేజ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్) కేటగిరిలో ఇద్దరు, డీపీఓ కార్యాలయం ప్యానల్ నుంచి మరో సీనియర్ అసిస్టెంట్‌కు డిప్యూటీ ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఈ నెల 11న పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ క్రిష్ణతేజ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఉత్తర్వులు వెలువడి పది రోజులు పూర్తయినా ప్లేస్‌మెంట్స్‌కు సంబంధించి జిల్లా అధికారుల్లో ఉలుకు పలుకు లేదన్న చర్చ జరుగుతోంది. ఇప్పటికే ఆయా మండలాలకు సంబంధించి స్థానిక ప్రజా ప్రతినిధుల నుంచి కొందరు లేఖలు కూడా సమర్పించినట్లు సమాచారం. ఆ మేరకు అనంతపురం జిల్లాలోని నాలుగు మండలాలకు సంబంధించిన డిప్యూటీ ఎంపీడీఓలకు బుధవారం ప్లేస్‌మెంట్స్ కేటాయిస్తూ డీపీఓ ఉత్తర్వులు జారీ చేశారు. సత్యసాయి జిల్లాకు సంబంధించి అతీగతీ లేకుండా పోతోందని బాధిత ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగోన్నతి పొంది.. ప్లేస్‌మెంట్స్ కోసం ఎదురు చూస్తున్న వారి వివరాలు ఇలా ఉన్నాయి.



ఉద్యోగి పేరు	ప్రస్తుత స్థానం	జిల్లా/మండలం కేటాయింపు..
అశోక్ కుమార్	ఆకుతోటపల్లి	రాప్తాడు
గోపాల్	పామిడి	బెళుగుప్ప
రమణ	బొమ్మనహాల్	తాడిపత్రి
చంద్రశేఖర్	సీకే పల్లి	బ్రహ్మసముద్రం
శ్రీనివాసరెడ్డి	కొత్తచెరువు	సత్యసాయి
ప్రవీణ్‌కుమార్	నారాయణపురం	సత్యసాయి
ముత్యాలరెడ్డి	గార్లదిన్నె	సత్యసాయి
ప్రేమ్‌కుమార్	రాప్తాడు	సత్యసాయి
అబ్దుల్ మునాఫ్	కాలసముద్రం	సత్యసాయి
సాధిక్ అలీ	బుక్కపట్నం	సత్యసాయి
సుధాకర్ కుమార్	అమరాపురం	సత్యసాయి
బాబురావు	రొళ్ల	సత్యసాయి
వెంకటేశ్వరప్రసాద్	గుత్తి	అన్నమయ్య
మనోహర్	డీపీఓ కార్యాలయం	సత్యసాయి
ఎమ్ఎల్ఎన్ ప్రసాద్	కణేకల్లు	సత్యసాయి

సిసలైన పండగ..!

- డీఏ, అలవెన్సుల విడుదలపై ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల హర్షాతిరేకాలు
- జేఏసీల ఆధ్వర్యంలో ఆనందోత్సాహాలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దీపావళి పండుగకు ఒకరోజు ముందు ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఒక డీఏతోపాటు ఇతర అలవెన్సులను విడుదల చేయడంపై ఆయావర్గాలు హర్షం వ్యక్తంచేశాయి. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాల జేఏసీ నాయకులతో చర్చలు జరపడం, వారి సమక్షంలోనే డీఏ, పలు డిమాండ్లపై సానుకూలంగా స్పందించడంపై వారు సంతోషపడుతున్నారు. 60 రోజుల్లో హెల్త్ కార్డుల వ్యవస్థను సక్రమంగా నడిపేందుకు కమిటీని ఏర్పాటు చేసి, ఇన్సూరెన్స్ విధానంపై పరిశీలనకు ఆదేశాలు జారీ చేయడంతో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చైల్డ్‌కేర్ లీవ్ అవకాశాన్ని మహిళా ఉద్యోగులకు ఉద్యోగ విరమణ వరకూ పొడిగించడంపై వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. హెల్త్ కార్డుల విషయంలో ప్యాకేజీ రేట్లు పెంచడం, జిల్లా ఆస్పత్రుల్లో చికిత్స పరిమితిని రూ.50 వేల నుంచి రూ.లక్షకు పెంచడం పట్ల ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు.. సీఎం చంద్రబాబునాయుడు చిత్తశుద్ధి చాటుకున్నారని ప్రశంసలు కురిపిస్తున్నారు.

మిగిలిన డీఆర్, క్వాంటం ఆఫ్ పెన్షన్‌ను పెంచి ఆదుకోవాలి



రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించిన డీఏ, అలవెన్సుల విషయం ఆనందం కలిగించే విషయం. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన విధంగా పెన్షనర్లకు డీఏను ఇచ్చింది. గత వైసీపీ ప్రభుత్వం తగ్గించిన క్వాంటం ఆఫ్ పెన్షన్‌ను పెంచి ఉంటే బాగుండేది. అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాలను చర్చలకు పిలిచి, అభిప్రాయాలు సేకరించడం సంతృప్తినిచ్చే అంశం. భవిష్యత్తులో పెన్షనర్లకు సంబంధించి డీఆర్‌లు, క్వాంటం ఆఫ్ పెన్షన్ పెంపుపై ప్రకటన చేస్తారనే నమ్మకం ఉంది.

-పెద్దన గౌడ్, ఏపీ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు

జేఏసీ నేతలకు గౌరవమివ్వడం గర్వంగా ఉంది



సీఎం చంద్రబాబునాయుడు ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలపై జేఏసీ నేతలను స్వాగతించి, గౌరవించడం పట్ల గర్వంగా ఉంది. వైసీపీ ప్రభుత్వంలో ఒక్కసారి కూడా ఉద్యోగ సంఘాలను సమస్యలపై చర్చించేందుకు పిలిచిన దాఖలాల్లేవు. డీఏ విడుదల చేయడంతోపాటు 2004కి ముందు రిక్రూట్ అయిన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం ఆయావర్గాల్లో నమ్మకం కలిగించింది.

-మనోహర్ రెడ్డి, ఏపీఎన్జీల సంఘం నగర అధ్యక్షుడు

చర్చలు జరపడం ఆనందంగా ఉంది..



ఉద్యోగ సంఘాల నేతలతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేరుగా చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించడం ఆనందంగా ఉంది. డీఏను విడుదల చేయడంతోపాటు పోలీసు అధికారులకు సంబంధించి సరెండర్ లీవ్‌లు చెల్లించడానికి అంగీకారం తెలపడం శుభపరిణామం. ఉద్యోగ సంఘాల నేతల అభిప్రాయాలను సేకరించడం ప్రతి ఉద్యోగి, పెన్షనర్ గౌరవంగా ఫీలవుతున్నారు. మిగిలిన డీఏలను విడుదల చేసి, ఉద్యోగులకు బాసటగా నిలవాలి.

-తోట చెన్నప్ప, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

మహిళా ఉద్యోగులకు చంద్రబాబు అండ..



మహిళా ఉద్యోగులకు సీఎం చంద్రబాబునాయుడు అండగా నిలబడ్డాడు. చైల్డ్‌కేర్ లీవ్‌లు (180 రోజులు) రిటైరయ్యే వరకూ పొందే అవకాశం కల్పించడం మహిళా ఉద్యోగుల్లో స్థైర్యం నింపింది. హెల్త్ కార్డుల విషయంలో ప్యాకేజీ రేట్లు పెంచడం భరోసా ఇచ్చింది.

-ఉమాదేవి, మహిళా విభాగ నగరాధ్యక్షురాలు, ఏపీఎన్జీఓల సంఘం

కరువు నేలలో కృష్ణమ్మ పరవళ్లు

మడకశిర, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): కరువు నేలలో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. నీటి వనరులే లేని మడకశిర ప్రాంతంలో కృష్ణాజలాలు ఉరకలు వేస్తున్నాయి. హంద్రీనీవా కాలువ ద్వారా గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి నీరు విడుదల చేస్తున్నారు. ఆ నీరు మండలంలోని మణూరు చెరువుకు చేరడంతో పూర్తిగా నిండిపోయింది. బుధవారం మరువ పోయింది. హరేసముద్రం చెరువుకు కృష్ణాజలాలు చేరుతున్నాయి. మడకశిర ప్రాంతంలోని మరిన్ని చెరువులను నింపనున్నట్లు హంద్రీనీవా అధికారులు చెబుతున్నారు. మూడేళ్లుగా సరైన వర్షాలు కురవక చేరువులో నీరులేక భూగర్భజలాలు అడుగంటిపోయి తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చిందనీ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆవేదన చెందారు. ప్రస్తుతం కృష్ణాజలాలతో చెరువు నిడడంతో తాగు, సాగు నీటి సమస్య పరిష్కారం కావడమేకాక బోర్ల కింద భూములు కూడా సాగులోకి వస్తాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గతేడాది నియోజకవర్గంలో పర్యటించినపుడు ఈ ప్రాంతంలోని చెరువులను కృష్ణాజలాలతో నింపి.. తాగు, సాగునీటి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఆ హామీని నెరవేరుస్తూ నీటితో చెరువులను నింపుతుండడంతో ఈ ప్రాంత ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.



కృష్ణాజలాలతో మరువ పారుతున్న మణూరు చెరువు

నత్తల దండు..!

పంటలో కుప్పలుగా నత్తలు



లక్షలాదిగా పంటలపై దాడి

మొక్క దశలోనే నాశనం చేస్తున్న వైనం

తీవ్రంగా నష్టపోతున్న రైతులు

అమడగూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నత్త అంటే ఎక్కడో ఒకటో, రెండో కనిపిస్తుంటాయి. అలాంటి నత్తలు లక్షలాదిగా దండుగా ఏర్పడి, పంటలను నాశనం చేస్తున్నాయి. రైతులు లక్షలు పెట్టుబడులు పెట్టి సాగుచేసిన పంటలను మొక్క దశలోనే దెబ్బతీస్తున్నాయి. మండలంలోని మహమ్మదాబాద్ పంచాయతీ పరిధి గొల్లపల్లి ప్రాంతంలో లక్షలాది నత్తలు పంటల్లో సంచరిస్తున్నాయి. గ్రామ పరిధిలో 200 ఎకరాలదాకా సజ్జ, మొక్కజొన్న, టమోటా, మిరప, వంకాయ తదితర పంటలు సాగుచేశారు. అన్ని పంటలపైనా నత్తలు ప్రభావం చూపుతున్నాయి. మొక్క దశలో పూర్తిగా తినేస్తున్నాయి. వీటి బారి నుంచి పంటలను ఎలా కాపాడుకోవాలో అర్థంకాక రైతులు దిక్కులు చూస్తున్నారు. ఏడాదిన్నరగా వాటితో నష్టపోతూనే ఉన్నారు. పగలు పంటల్లో ఉంటూ, రాత్రిళ్లు ఇళ్లల్లోకి చొరబడి నిద్రలేకుండా చేస్తున్నాయని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు నత్తల బెడద తప్పించాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.



మహిళా రైతుతో మాట్లాడుతున్న ఏఓ

నత్తలతో నష్టపోతున్నాం



ఎనిమిది ఎకరాల్లో టమోటా, మొక్కజొన్న సాగుచేశా. భారీ సంఖ్యలో నత్తలు చేరి పంటలను నాశనం చేస్తున్నాయి. పంటలు సాగు చేయాలంటే ఇబ్బందిగా మారింది. వ్యవసాయంతోనే జీవనం సాగిస్తున్నాం.పంటలు సాగు చేయకపోతే ఎలా బతకాలి? -గోపాల్‌రెడ్డి, గొల్లపల్లి

ఇళ్లలోకి చేరి ఇబ్బంది పెడుతున్నాయి



పగలు పంటలో, రాత్రి ఇళ్లలోకి చేరి నిద్ర లేకుండా చేస్తున్నాయి. రోగాల బారిన పడతామేమోనని ఆందోళన చెందుతున్నా. సాగుచేసిన పంటలను మొక్క దశలోనే తినేశాయి. తీవ్రంగా నష్టపోయా. - అమర్‌నాథ్‌రెడ్డి

రెండు పద్ధతుల్లో నివారణ

నత్తలు పొలాల్లోకి చొరబడి పంటలను నాశనం చేస్తున్నది వాస్తవమే. వీటి నివారణకు రెండు పద్ధతులున్నాయి. లీటరు నీటికి 100 గ్రాముల ఉప్పు కలిపి పంటపై కాకుండా నత్తలపై పిచికారీ చేయాలి. రెండో విధానంలో ఎకరాకు 250 గ్రాముల కాపర్ సల్ఫేట్, 250 గ్రాముల ఫెరస్ సల్ఫేట్ డ్రిప్పు ద్వారా కానీ, పిచికారీ చేసినా నత్తల బారి నుంచి పంటలను కాపాడుకోవచ్చు.

- వెంకటరమణాచారి, ఏఓ, అమడగూరు

సెక్టోరల్స్ ఎంపికపై మళ్లీ వివాదం

విచారణకు కమిటీని నియమించిన కలెక్టర్

అనంతపురం విద్య, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష సెక్టోరల్స్ ఎంపికపై మళ్లీ వివాదం తలెత్తింది. కూటమి సర్కారు కొలువుదీరాక ఏడాదికిపైగా వివిధ కారణాలతో సెక్టోరల్స్ నియామకాలు చేపట్టలేకపోయారు. మునుపటి కలెక్టర్ వినోద్‌కుమార్ ఈ ఏడాది జూలైలో రీ నోటిఫికేషన్ విడుదల చేయించి, ఆగస్టులో ఇంటర్వ్యూలు నిర్వహణకు ఆదేశాలు ఇచ్చారు. అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డీఈఓ ప్రసాద్‌బాబు, ఏపీసీ శైలజ, డైట్ ప్రిన్సిపాల్‌తో కూడిన కమిటీ దరఖాస్తుదారుల్లో అర్హులైన 47 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. 42 మంది హాజరయ్యారు. ఆరు సెక్టోరల్స్ పోస్టులకుగాను ఐఈడీ పోస్టుకు అభ్యర్థి కరువయ్యారు. మిగిలిన ఐదు సెక్టోరల్స్ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేశారు. అందుకు అప్పటి కలెక్టర్ వినోద్‌కుమార్ ఆమోదం తెలిపారు. నలుగురు సెక్టోరల్స్ జాయిన్ అయ్యారు. ఏఎస్ఓగా ఎంపికైన అభ్యర్థి నేటికీ జాయిన్ కాలేదు. ఈనేపథ్యంలో ఈ ఎంపిక ప్రక్రియపై కొందరు విమర్శలు గుప్పిస్తున్నారు. ఒక్క పోస్టుకూడా దళిత సామాజికవర్గానికి ఇవ్వలేదని ఆ వర్గాలు.. మండిపడుతున్నాయి. కొత్త కలెక్టర్ ఆనంద్‌ను దళిత సంఘాల నేతలు కలిసి సెక్టోరల్స్ ఎంపికలో అక్రమాలు జరిగాయనీ, తమకు అన్యాయం చేశారని ఫిర్యాదులు చేశారు. దీంతో కలెక్టర్.. సెక్టోరల్స్ ఎంపిక పక్రియపై విచారణకు ఆదేశించారు. అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, గిరిజన సంక్షేమ శాఖ డీడీ శ్రీనివాసరావు, ఎస్సీ సంక్షేమ శాఖ డీడీ కుష్బూకొఠారితో కమిటీ వేశారు. ఈ కమిటీ సెక్టోరల్స్ ఎంపికపై విచారణ చేపట్టి, నివేదికలు కలెక్టర్‌కు ఇవ్వనుంది. సమగ్రశిక్ష సెక్టోరల్స్ వివాదం మళ్లీ మొదటికి రావడం విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది.

నేడు రేగాటిపల్లి రైల్వేగేట్ మూసివేత

ధర్మవరం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రేగాటిపల్లి రోడ్డులో ఉన్న రైల్వేగేట్‌ను గురువారం ఉదయం 8 గంటల నుంచి శుక్రవారం ఉదయం 8గంటల వరకు మూసివేయనున్నట్టు బెంగళూరు డివిజన్ రైల్వే అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రేగాటిపల్లి రైల్వే గేట్ మరమ్మతుల కారణంగా రైల్వేగేట్‌ను మూసివేస్తున్నామని పేర్కొన్నారు. పట్టణంలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులకు కూడా సమాచారాన్ని తెలియజేశామని వివరించారు.

29న జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీల సమావేశాన్ని ఈ నెల 29 నిర్వహిస్తామని సీఈఓ శివశంకర్ తెలిపారు. దీనికోసం 1 నుంచి 7 వరకు అంశాలకు సంబంధించి అజెండా అంశాలను సిద్ధం చేశామని తెలిపారు. అజెండాలోని అంశాలపై చర్చ జరిపి, తీర్మానాలకు అమోదం తెలుపుతారని వెల్లడించారు. గౌరవ సభ్యులు జడ్పీ కార్యాలయంలో జరిగే సమావేశాలకు హాజరు కావాలని కోరారు.

29న జిల్లాస్థాయి క్రీడాపోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు ఈనెల 29వ తేదీన జిల్లాస్థాయి క్రీడా పోటీలను జిల్లా కేంద్రంలో నిర్వహిస్తామని డీఎస్‌డీఓ అధికారి మంజుల తెలిపారు. అథ్లెటిక్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, పవర్‌లిఫ్టింగ్, ఖో-ఖో, క్రికెట్ పోటీలను నీలం సంజీవరెడ్డి పీటీసీ మైదానంలో నిర్వహిస్తామని తెలిపారు. ఫుట్‌బాల్, హాకీ, లాన్ టెన్నిస్ పోటీలను ఆర్ట్స్ కాలేజీ మైదానంలో నిర్వహిస్తామని, రెజ్లింగ్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, క్యారమ్స్, చెస్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, యోగా, బెస్ట్ ఫిజిక్, డ్యాన్స్ మ్యూజిక్ పోటీలను అశోక్ నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తామని తెలిపారు. ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ సమీపంలోని స్విమ్మింగ్‌పూల్‌లో స్విమ్మింగ్ పోటీలు ఉంటాయని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు నవంబరు 5వ తేదీ నుంచి ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. వివరాలకు 08554-315632 నంబరులో సంప్రదించాలని కోరారు.

28న సర్పంచ్‌లకు శిక్షణ

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలు సొంత ఆదాయ వనరులు సమకూర్చుకోవడం గురించి ఈ నెల 28, 29 తేదీలలో శిక్షణ ఇస్తామని జడ్పీ సీఈఓ శివశంకర్ బుధవారం తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని మండలాల నుంచి ఒక సర్పంచ్, ఒక పంచాయతీ కార్యదర్శి, ఒక డిజిటల్ అసిస్టెంట్, ఒక ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ను శిక్షణకు ఎంపిక చేశామని తెలిపారు. ఎంపికైనవారిని తప్పనిసరిగా శిక్షణకు పంపాలని ఎంపీడీఓ, డిప్యూటీ ఎంపీడీఓలకు ఆదేశాలు జారి చేశారు.

మరణిస్తూ మరొకరికి కంటిచూపు


గోవిందరెడ్డి (ఫైల్)

చిలమత్తూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మరణిస్తూ నేత్రదానంతో మరొకరికి కంటి చూపు ప్రసాదించడం గొప్ప విషయమనే చెప్పాలి. మనిషి చనిపోయినా నేత్రాలు మరొక జీవితకాలం పాటు ఇతరులకు చూపునిస్తాయి. అలాంటి ఆలోచనతో ఓ యువకుడి తండ్రి తన కుమారుడు చనిపోయాడన్న పుట్టెడు దుఃఖంలోనూ మంచి నిర్ణయం తీసుకుని అభినందనలు అందుకున్నారు. మండలంలోని టేకులోడు గ్రామంలో గోవిందరెడ్డి (32)అనే యువకుడు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు.. మృతుడి ఇంటి వద్దకే వైద్యులు వచ్చి రెండు కళ్లను సురక్షితంగా శస్త్రచికిత్స చేసి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మృతుడి తండ్రి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. తన కొడుకు మరణించాడన్న బాధ ఉన్నా అతడి కళ్లు ఇతరులకు చూపు ఇస్తుండటం మరచిపోయేలా చేస్తోందన్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

విద్యార్థిని ఆచూకీ లభ్యం

రాప్తాడు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కనిపించకుండా పోయిన విద్యార్థిని అక్షితను పోలీసులు గుర్తించి, ఇంటికి చేర్చారు. మండలంలోని పంగల్‌రోడ్డు సమీపాన గల విన్సెంట్ డీపాల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న అక్షిత మంగవారం అదృశ్యమైన విషయం తెలిసిందే. దీనిపై కుటుంబ సభ్యులు రాప్తాడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో రాప్తాడు సీఐ శ్రీహర్ష, పోలీసులు కొన్ని గంటల్లోనే విద్యార్థిని ఆచూకీ కనుగొన్నారు. హిందూపురంలోని ఆర్టీసీ కాలనీలో విద్యార్థిని ఉండగా.. సాంకేతికత సాయంతో ఆచూకీ కనుగొన్నారు. తెల్లవారుజామున 3 గంటలకు విద్యార్థిని వద్దకెళ్లి, క్షేమంగా రాప్తాడు పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారు. కుటుంబ సభ్యులకు అప్పగించారు.

టమోటా కిలో రూ.26

అనంతపురం రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో బుధవారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.26తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.14, సరసరిగా రూ.20తో విక్రయాలు జరిగాయన్నారు. మొత్తంగా మార్కెట్‌కు 1500 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

వాలీబాల్ జట్ల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ వాలీబాల్ డివిజనల్ జట్లను ఎంపిక చేశారు. బుధవారం స్థానిక న్యూటౌన్ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో అండర్-17 బాల, బాలికల డివిజన్‌స్థాయి పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరచిన వారిని జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. జట్ల వివరాలను స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు వెల్లడించారు. బాలుర జట్టుకు భానుతేజ, మంజునాథ్, గోవర్ధన్, లక్ష్మీప్రసన్నకుమార్, వరుణ్‌కుమార్, అభి, భరత్ కుమార్, చరణ్‌యాదవ్, గణేష్, ఈశ్వర్, ఉదయ్‌కిరణ్, ముష్కిన్, బాలికల జట్టుకు అక్షర, లక్ష్మీప్రియ, తుషిత, గుణప్రవల్లిక, కుసుమ, జ్యోతి, నవిత, మానస, నిఖిల, సాయిదర్శిని, శృతికీర్తన ఎంపికయ్యారన్నారు.


వాలీబాల్ బాలికల జట్టు

ఉమ్మడి జిల్లాకు బుల్లెట్ రైళ్లు..!

350 కి.మీ. వేగాన్ని తట్టుకునేలా రైలు మార్గం
తెలుగు రాష్ట్రాల మీదుగా రెండు హైస్పీడ్ ట్రాక్‌లు
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ముందడుగు
నమూనాల విడుదల

గుంతకల్లు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లా మీదుగా అత్యున్నతమైన హైస్పీడ్ రైల్వే లైన్‌ను నిర్మించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంకల్పించాయి. ఈ రైలు మార్గం సాకారమైతే అనంతపురం, సత్యసాయి జిల్లాలకు బుల్లెట్ రైళ్ల యోగం పట్టనుంది. రెండు తెలుగు రాష్ట్రాల మీదుగా రెండు హైస్పీడ్ రైలు మార్గాలను నిర్మించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందడుగు వేశాయి. ఈ ప్రాజెక్టుకు సంబంధించి బుధవారం రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనమిక్ సర్వీస్ (రైట్స్) సంస్థ నమూనాలను వెల్లడించింది. ఇందులోని సమాచారం ప్రకారం.. తెలుగు రాష్ట్రాల మీదుగా 350 కి.మీ.ల వేగంతో వెళ్లగలిగే అత్యుత్తమ శ్రేణిలో రెండు హైస్పీడ్ రైలు మార్గాలను నిర్మించనున్నారు. హైదరాబాద్-బెంగళూరు (605 కి.మీ.), హైదరాబాద్-చెన్నై (760 కి.మీ.) రైల్ రోడ్లకు రూపకల్పన చేశారు. హైదరాబాద్-బెంగళూరు రైలు మార్గం తెలంగాణ, ఏపీ, కర్ణాటక రాష్ట్రాల మీదుగా, హైదరాబాద్-చెన్నై రైలు మార్గం తెలంగాణ, ఏపీ, తమిళనాడు రాష్ట్రాల గుండా నిర్మిస్తారు. ఈ రైలు మార్గాలతో బుల్లెట్



రైలు వెళ్లగలిగే స్థాయిలో ఎల్సీలు లేని, వంద శాతం రక్షిత (ప్రొటెక్టెడ్) అత్యద్భుతమైన లైన్ ఆవిష్కారం కానుంది. ప్రస్తుతమున్న రైల్ ట్రాక్‌పై 130 కి.మీ. వేగంతో రైళ్లను నడపలేమన్న వాస్తవాన్ని అవగతం చేసుకున్న రైల్వే శాఖ ప్రత్యేక హైస్పీడ్ రైలు మార్గాలను నిర్మించే ఆలోచనకు శ్రీకారం చుట్టింది.

అంచనా వ్యయాలు

అనంత ఉమ్మడి జిల్లా మీదుగా వెళ్లే హైదరాబాద్-బెంగళూరు లైన్ నిడివి 605 కి.మీ. కాగా ఇందుకు రూ.2.38 లక్షల కోట్లు వ్యయమవుతుందని అంచనావేశారు. హైదరాబాద్-చెన్నై లైన్ నిడివి 760 కి.మీ.లు కాగా, దీని నిర్మాణానికి రూ.3.04 లక్షల కోట్ల నిధుల అంచనా కట్టారు. ఈ లైన్ రాష్ట్రంలో కర్నూలు జిల్లాలో 46.56 కి.మీ.లు, నంద్యాల జిల్లాలో 37.3 కి.మీ.లు, అనంతపురం జిల్లాలో 86.6 కి.మీ.లు, శ్రీ సత్యసాయి జిల్లాలో 79.08 కి.మీ. మేర నిర్మితం కానుంది. ఇందుకు గానూ 988.82 హెక్టార్ల భూమి అవసరమతుందని అంచనా వేశారు. హైదరాబాద్-చెన్నై లైన్ 760కి.మీ. నిర్మించనుండగా.. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో 504 కి.మీ.ల లైన్ ఏర్పడనుంది. ఇందుకు మొత్తం మీద 1,873.7 హెక్టార్ల భూమి అవసరం కానుంది.

రైలు మార్గం ఇలా..

హైదరాబాద్-బెంగళూరు హైస్పీడ్ రైలుమార్గాన్ని నిర్మించడానికి స్కెచ్‌ను రూపొందించారు. హైదరాబాద్ ఎయిర్‌పోర్టు, భరత్‌సిటీ, మహబూబ్‌నగర్, వనపర్తిరోడ్, కర్నూలు, డోన్, గుత్తి, అనంతపురం, దుద్దేబండ, హిందూపురం, కర్ణాటకలోని అలిపుర, దేవనహళ్లి, కొడిహళ్లి మీదుగా లైన్‌ను నిర్మిస్తారు. హైదరాబాద్-చెన్నై లైన్‌ను హైదరాబాద్, శంషాబాద్, భరత్ సిటీ, ఏపీలోని డచ్చిపల్లి, నంబూరు, గుంటూరు, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, తిరుపతి (ఎయిర్‌పోర్టు), చెన్నై ఔటర్ రింగ్ రోడ్, చెన్నై స్టేషన్ల మీదుగా 760 కి.మీ.ల లైన్‌ను నిర్మిస్తారు. ఈ లైన్ ఏపీలోని పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల గుండా వెళ్తుంది.

కార్యాచరణ ఇలా..

ఈ రెండు అత్యుత్తమ స్థాయి హైస్పీడ్ రైల్వే లైన్ల నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్యాచరణను రూపొందించాయి. తొలుత రైలు మార్గాల భూమి అనుకూల అలైన్‌మెంట్ గుర్తింపు, ఏ స్టేషన్లను నిర్మించాలి అనే దానిపై తుది నిర్ణయం తీసుకుంటారు. తర్వాత భూసేకరణ, అటవీ శాఖ భూమి క్లియరెన్స్ చేపడతారు. రైల్వే స్టేషన్ల నిర్మాణానికి 50 ఎకరాల చొప్పున భూమి సేకరణ, మౌలిక సదుపాయాల కోసం బ్లూప్రింట్ తయారీ, ప్రాజెక్టు సర్వే, నిర్మాణానికి సమన్వయం కోసం రైల్వే, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో నోడల్ టీంలను నియామిస్తారు.

ప్రత్యేక రైళ్లలో
లక్ష మందిని గమ్యానికి చేర్చాం
డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా

గుంతకల్లు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పండుగలకు ప్రత్యేక రైళ్లను నడపడం ద్వారా అదనంగా లక్షమంది ప్రయాణికులను గమ్య స్థానాలకు చేర్చామని డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా తెలిపారు. తన కార్యాలయంలో బుధవారం ఆయన సమావేశాన్ని నిర్వహించారు. దసరా, దీపావళి రద్దీని దృష్టిలో ఉంచుకుని, టైం ఆఫ్ డిమాండ్ యోచనతో 66 ప్రత్యేక రైళ్ల ద్వారా 309 ట్రిప్పులను నడిపామని తెలిపారు. గుంతకల్లు రైల్వే డివిజన్ మీదుగా ప్రధాన నగరాలకు ప్రత్యేక రైళ్లలో లక్ష మందిని తరలించామని వివరించారు. 12 రైళ్లకు 19 స్టేషన్లలో తాత్కాలిక స్టాపింగ్‌లను కల్పించామని, ప్రయాణికుల సౌకర్యార్థం హెల్ప్ డెస్కులను కూడా నిర్వహించామని తెలిపారు. పెద్ద రైల్వే స్టేషన్లలో అన్ రిజర్వుడు టిక్కెట్ కౌంటర్లను, టికెట్ వెండింగ్ యంత్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది ప్రయాణికులకు భద్రతను కల్పించారని తెలిపారు. సమావేశంలో ఏడీఆర్ఎం సుధాకర్, సీనియర్ డీసీఎం మనోజ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా

గుంతకల్లు మీదుగా ప్రత్యేక రైలు

గుంతకల్లు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని తగ్గించడానికి గుంతకల్లు మీదుగా షోలాపూర్-అనకాపల్లి మధ్య ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు బుధవారం తెలిపారు. షోలాపూర్-అనకాపల్లి ప్రత్యేక రైలు (నంబర్ 01477) అక్టోబరు 24 నుంచి నవంబరు 28వ తేదీ వరకూ శుక్రవారాలలో, దీని తిరుగు ప్రయాణపు రైలు (01478) అక్టోబరు 25 నుంచి నవంబరు 29వ తేదీ వరకూ శనివారాలో నడుపుతామని తెలిపారు. ఈ రైలు దుధని, గంగాపూర్, కలబురగి, వాడి, యాద్గిర్, క్రిష్ణా, రాయచూరు, మంత్రాలయం రోడ్డు, ఆదోని, గుంతకల్లు, అనంతపురం, ధర్మవరం, కదిరి, మదనపల్లి రోడ్డు, పీలేరు, పాకాల, తిరుపతి, రేణిగుంట, శ్రీకాళహస్తి, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, యలమంచిల స్టేషన్ల మీదుగా గమ్యస్థానానికి చేరుకుంటుందని తెలిపారు.

టిడ్కో గృహాలపై కదలిక..!

నిర్మాణాల పూర్తికి ప్రభుత్వం కసరత్తు
రూ.382 కోట్ల నిధులకు ప్రతిపాదనలు
ఉమ్మడి జిల్లాకు 38 వేల ఇళ్లు మంజూరు
తుది దశకు చేరిన 16,272 ఇళ్ల నిర్మాణాలు
ఐదేళ్లూ పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం


ఇటీవల టిడ్కో గృహాలను పరిశీలిస్తున్న అనంత అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి, ఏఎంసీ కమిషనర్

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): టిడ్కో గృహాల లబ్ధిదారులకు త్వరలో రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పనున్నట్లు సమాచారం. సుమారు ఏడేళ్లుగా ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు గృహాలను స్వాధీనం చేయడానికి ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. 2014-19లో అప్పటి టీడీపీ ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లోని పేదలకు ఏపీ టిడ్కో (ఆంధ్రప్రదేశ్ టౌన్‌షిప్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) గృహాలను నిర్మించేందుకు శ్రీకారం చుట్టింది. ఉమ్మడి అనంతపురం జిల్లాకు 38,740 ఇళ్లను మంజూరు చేసింది. 16,272 ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు టిడ్కోగృహాలను పూర్తిగా విస్మరించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అసంపూర్తిగా ఉన్న టిడ్కో గృహాలను పూర్తి చేస్తామని ప్రకటించింది. అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడానికి రూ.382కోట్లు నిధులు అవసరమవుతాయని టిడ్కో ఇంజనీర్లు ప్రతిపాదనలు పంపారు. ఇళ్లు కేటాయించకనే ఈఎంఐలు కట్టాలని బ్యాంకుల నుంచి నోటీసులు పంపడంపై పలువురు లబ్ధిదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, టిడ్కో, అనంత నగరపాలక సంస్థ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించడంతో టిడ్కో ఇళ్లపై ఆశలు చిగురించాయి.

38వేల టిడ్కో గృహాలు మంజూరు

2014-19లో ఉన్న అప్పటి టీడీపీ ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లో ఉండే పేదలకు అపార్ట్‌మెంట్ల తరహాలో టిడ్కోగృహాలు మంజూరు చేసింది. ఉమ్మడి జిల్లాకు 38,740 టిడ్కో గృహాలను మంజూరు చేశారు. ఇందులో తాడిపత్రిలో ఫేజ్-1 కింద 3009 ఇళ్లు మంజూరు కాగా 2304, ఫేజ్-2 కింద 3,520 ఇళ్లకు గాను 2,880 ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ధర్మవరంలో 8,832 ఇళ్లకు గాను 1440 ఇళ్లు మాత్రమే నిర్మాణం చేపట్టారు. గుత్తికి 398 మంజూరు చేయగా 96 నిర్మాణదశలో నిలిచిపోయాయి. హిందూపురంలో 2,750 ఇళ్లకు గాను 1200 ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించారు. కదిరిలో 3,762 ఇళ్లకు గాను 1104 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారు. పామిడిలో 2,599 ఇళ్లకు గాను 1344 ఇళ్ల నిర్మాణం చేపట్టారు. పుట్టపర్తిలో 1243 ఇళ్లు మంజూరు కాగా 432 ఇళ్లు ప్రారంభించారు. అనంతపురంలో 6,117 ఇళ్లు మంజూరు చేయగా... 2304 ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించారు. గుంతకల్లులో 4,719 ఇళ్లు మంజూరు చేయగా 2,160 ఇళ్ల నిర్మాణ దశలో నిలిచిపోయాయి. రాయదుర్గానికి 1791 ఇళ్లు కేటాయించగా 1008 ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాలోని 11 పట్టణ ప్రాంతాల్లో 38,740 ఇళ్లు మంజూరు చేయగా.. 16,272 ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు. వీటిలో సుమారు 12వేలకు పైగా గృహాలను పూర్తి చేసి త్వరలో లబ్ధిదారులకు అందజేయడానికి సిద్ధం చేస్తున్నారు.


టిడ్కో ఇళ్ల మధ్యలో ఏపుగా పెరిగిన కంపచెట్లు


అనంతపురంలోని టిడ్కో గృహాలు

గాలికొదిలేసిన వైసీపీ ప్రభుత్వం

వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో టిడ్కో ఇళ్లను పూర్తిగా విస్మరించింది. అసంపూర్తిగా ఉన్న టిడ్కో గృహాలను పూర్తి చేయాల్సిన వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసింది. దీంతో అసంపూర్తిగా ఉన్న ఇళ్లు అసాంఘిక కార్యకలాపాలు, విషపురుగులకు అవాసాలుగా మారాయి. చివరి దశలో ఉన్న ఇళ్లను పూర్తి చేయడానికి వైసీపీ ప్రభుత్వంలో పలుమార్లు టిడ్కో అధికారులు ప్రతిపాదనలు పంపినా బుట్టదాఖలు చేశారు. పైగా టీడీపీ ప్రభుత్వం నిర్మించిన టిడ్కో గృహాలకు పలు ప్రాంతాలలో వైసీపీ రంగులు వేయడం పట్ల లబ్ధిదారుల నుంచి తీవ్ర విమర్శలు వచ్చాయి.

రూ.382.92 కోట్ల నిధులకు ప్రతిపాదనలు

ఉమ్మడి జిల్లాలో అసంపూర్తిగా ఉన్న టిడ్కో గృహాల నిర్మాణాలు పూర్తి చేయడానికి రూ.382.92కోట్లు నిధులు అవసరమవుతాయని ఆశాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అనంతపురం జిల్లాలో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణానికి రూ.198 కోట్లు, మౌలిక వసతుల కల్పనకు రూ.55.27 కోట్లు, మురుగు నీటి శుద్ధి ప్లాంట్ ఏర్పాటుకు రూ.5.79 కోట్లు, తాడిపత్రిలో మహిళా మార్టుకు రూ.1.63 కోట్లు మొత్తంగా రూ.260.78కోట్లు నిధులు అవసరం ఉందని టిడ్కో ఇంజనీర్లు ప్రతిపాదనలు పంపారు. సత్యసాయి జిల్లాలో అసంపూర్తి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడానికి రూ.86.68 కోట్లు, మౌలిక వసతుల కల్పనకు రూ.32కోట్లు, మురుగునీటి శుద్ధి వాటర్‌ప్లాంట్‌కు రూ.3.46 కోట్లు మొత్తంగా రూ.122.14 కోట్లు నిధుల అవసరమవుతాయని ప్రతిపాదనలు అందజేశారు.

కంపచెట్లతో నిండిన సముదాయాలు

గత ప్రభుత్వం గాలికి వదిలేయడంతో టిడ్కో గృహ సముదాయాల్లో కంపచెట్లు పెరిగిపోయి అడవులను తలపిస్తున్నాయి. మరోవైపు వర్షం నీటితో నిండిపోయాయి. అనంత అర్బన్‌కు సంబంధించి ఏపీ టిడ్కో గృహ సముదాయం చిన్మయనగర్‌లో నిర్మిస్తున్నారు. అనంత నగరపాలక సంస్థ పరిధిలో 5వేల ఇళ్లకు 2304 ఇళ్లు నిర్మాణ దశకు చేరాయి. ఇళ్ల నిర్మాణం అలా ఉంచితే.. ఏపుగా పెరిగిన కంప చెట్లు ఓ వైపు, మరోవైపు వర్షపు నీరు చేరి కుంటను తలపిస్తోంది. కంపచెట్లను తొలగించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఆందోళన వద్దు..



ఏపీ టిడ్కో లబ్ధిదారులు ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు. లబ్ధిదారుల ఆశలు, ఆలోచనలకు అనుగుణంగానే ప్రభుత్వం టిడ్కో గృహాలను పూర్తి చేయాలని నిర్ణయించింది. ఇటీవల ప్రభుత్వం లబ్ధిదారుల జాబితాను అందజేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఆ మేరకు మున్సిపల్ ఇంజనీర్లు, టిడ్కో అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో నిర్మాణ సముదాయాలను పరిశీలించి తుది నివేదికను ప్రభుత్వానికి పంపారు. నివేదిక ఆధారంగా రెండు మూడు నెలల్లో లబ్ధిదారులకు టిడ్కో గృహాలను అందజేయనుంది.

-రాజశేఖర్, ఎస్ఈ, అనంతపురం నగరపాలక సంస్థ

త్వరలోనే శుభవార్త వింటారు..



ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న టిడ్కో గృహ లబ్ధిదారులు త్వరలో శుభవార్త వింటారు. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. టిడ్కో, మున్సిపల్ ఇంజనీర్ల ప్రతిపాదనల మేరకు నిధులు ఇవ్వడానికి ప్రభుత్వం సానుకూలంగా ఉంది. ఇప్పటికే టిడ్కో గృహాల లబ్ధిదారులకు ఇళ్ల కేటాయింపులు, ఆలస్యంపై అవగాహన కల్పిస్తున్నాం. క్షేత్రస్థాయిలో పరిశీలించి.. వాటి పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. లబ్ధిదారులకు పూర్తి నిర్మాణం, కనీస వసతులు మురుగుకాలవలు, రోడ్లు, మంచినీటి వసతి కల్పించి అందజేస్తాం.

-సుధారాణి, టిడ్కో ఈఈ, ఉమ్మడి అనంతపురం జిల్లా

భార్య హత్య కేసులో భర్త అరెస్ట్


అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

రాయదుర్గం రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మద్యం కోసం డబ్బులు ఇవ్వలేదని భార్యను హత్య చేసిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. డీ. హీరేహాళ్ మండలం మురడి గ్రామంలో మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వలేదని హనుమంతరాయుడు తన భార్య నాగమణిని గొడ్డలితో నరికి చంపిన కేసులో అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ వెంకటరమణ, ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. మురడి గ్రామానికి చెందిన హనుమంతరాయుడు రాయదుర్గం మండలం టి.వీరాపురం గ్రామానికి చెందిన నాగమణిని పెళ్లి చేసుకున్నాడు. మద్యానికి బానిసై డబ్బులు ఇవ్వలేదని నిత్యం గొడవపడుతుండేవాడు. ఈ నెల 20న నిద్రపోతున్న భార్య నాగమణిని చంపేసినట్లు పోలీసుల ఎదుట నిందితుడు హనుమంతరాయుడు నేరం ఒప్పుకున్నట్లు తెలిపారు. మృతురాలి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని రాయదుర్గం సివిల్‌కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

ఎక్సైజ్ పోలీసులపై దాడి

అల్లీపూర్ తండాలో తనిఖీలు చేస్తుండగా ఘటన
కేసు నమోదు


గాయపడిన వెంకటనారాయణ

కదిరి అర్బన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): తనిఖీలకు వెళ్లిన ఎక్సైజ్ పోలీసులపై గ్రామస్థులు దాడిచేసిన ఘటన కదిరి మండలం అల్లీపూర్ తండాలో చోటు చేసుకుంది. కదిరి అప్‌గ్రేడ్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. అనంతపురం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు బుధవారం నాటుసారా తయారు చేస్తున్నారన్న సమాచారంతో అల్లీపూర్‌తండాకు వెళ్లారు. గ్రామంలో రమణమ్మ ఇంట్లో సోదాలు చేస్తుండగా.. ఆమెతో పాటు గ్రామానికి చెందిన వెంకటేష్‌నాయక్, రవీనాయక్, మరికొంతమంది గ్రామస్థులు తమ గ్రామానికి వచ్చి తనిఖీలు చేస్తారా అంటూ తిరగబడి కట్టెలతో దాడి చేశారు. దాడిలో ఎక్సైజ్ కానిస్టేబుల్ వెంకటనారాయణ తలకు గాయమవ్వగా.. మరో కానిస్టేబుల్ వెంకటప్రసాద్‌కు స్వల్పగాయాలయ్యాయి. గాయపడిన కానిస్టేబుళ్లను కదిరి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. విధి నిర్వహణలో భాగంగా గ్రామానికి వెళ్లిన ఎక్సైజ్ పోలీసులపై దాడికి పాల్పడ్డ రమణమ్మ, వెంకటేష్‌నాయక్, రవీనాయక్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

చీనీ టన్ను రూ.16 వేలు

అనంతపురం రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్లో బుధవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా 16వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరిగా రూ.10వేలు పలికాయన్నారు.

నగరంలో రోడ్లు ఛిద్రం

● పెద్దఎత్తున గుంతలు పడి, కంకర తేలిన వైనం ● వర్షం వస్తే పరిస్థితి దారుణం
● డ్రైనేజీ కాలువలదీ అదే పరిస్థితి ● ఇబ్బంది పడుతున్న ప్రజలు


ఎస్వీ థియేటర్ ఎదుట రోడ్డుపై నిల్వ ఉన్న వర్షపు నీరు


కంకర తేలి.. గుంతలమయమైన నాయక్‌నగర్ మెయిన్‌రోడ్డు


వేణుగోపాల్‌నగర్‌లో వాహనాలపై పడిన చెట్టు, విద్యుత్ స్తంభం

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నగరంలో పెరిగిపోతున్న జనాభాకు అనుగుణంగా రహదారులు, మురుగు కాలువ వ్యవస్థను ఆధునీకరించలేదు. దీంతో వాహనాల సంఖ్య అధికమై అన్ని ప్రధాన రహదారుల్లో మోకాల్లోతు గుంతలు ఏర్పడ్డాయి. వర్షం వస్తే ఆ గుంతల్లో నీరు చేరుతోంది. దీంతో ప్రజలకు ప్రయాణం నరకయాతనగా మారింది. చిన్నపాటి వర్షానికే నగరంలోని రోడ్లు ఛిద్రమవుతు న్నాయి. ఇక ఇరుకైన డ్రైనేజీ కాలువలు వర్షం వస్తే నిండిపోయి నీరంతా మురుగుతో కలిసి రోడ్లపైకి చేరుతోంది. దీంతో నగరవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

నగరంలో 247 కి.మీ. సీసీ.. 63 కి.మీ బీటీ రోడ్లు

అనంత నగరపాలక సంస్థలో 50డివిజన్ల పరిధిలో వందలాది కిలోమీటర్ల రోడ్లు ఉన్నాయి. వీటిలో 249.67కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు ఉన్నాయి. 63 కిలోమీటర్ల మేర బీటీరోడ్లు విస్తరించాయి. 20.165 కిలోమీటర్ల మేర కచ్చా రోడ్లు ఉన్నాయి. సీసీ, బీటీ రోడ్లలో చాలావరకు దెబ్బతిన్నాయి. వైసీపీ ప్రభుత్వంలో రోడ్డు పనులు చేయకపోవడంతో ఎన్నో ఏళ్లుగా ఉన్న రోడ్లన్నీ మోకాల్లోతు గుంతలు ఏర్పడ్డాయి.

చినుకు పడితే..

నగరంలో చినుకుపడితే చిత్తడిగా మారుతోంది. గుంతల రోడ్లతో పాటు డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో చిన్నపాటి వర్షానికే డ్రైనేజీ కాలువలు నిండి నీరు మురుగుతో సహా రోడ్లపైకి వచ్చేస్తోంది. అసలే గుంతల రోడ్లతో విసిగిపోతున్న నగరవాసులకు గుంతల్లో నిలిచిన వర్షం నీటితో మరింత అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రధానంగా రహదారులు, డ్రైనేజీల వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేస్తే తప్పా..నగరంలో పరిశుభ్ర వాతావరణం ఏర్పడడం కష్టంగా ఉంది.

వాహనాలపై కూలిన చెట్లు..

గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో నగరమంతా ఛిద్రంగా మారింది. వేణుగోపాల్‌నగర్‌లో వాహనాలపై భారీ చెట్టు, విద్యుత్తు స్తంభం కూలి భారీగా దెబ్బతిన్నాయి. అదృష్టవశాత్తూ ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. అధికారుల దూరదృష్టి లోపించడంతో నగరవాసులకు వర్షంతో మురుగు నీరు, గుంతల రోడ్ల సమస్య వెంటాడుతోంది. మోకాల్లోతు గుంతల్లో నిలిచిన వర్షం నీటితో గుంతలు తెలియక వాహనదారులు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికే ఈ సమస్యలపై అనేక ఫిర్యాదులు అందినా నగరపాలక సంస్థ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడం గమనార్హం.

రోడ్ల నిర్మాణం చేపడతాం

నగరంలో చాలా ప్రాంతాల్లోని రోడ్లలో గుంతలు ఏర్పడిన మాట వాస్తవమే. గుంతలు పూడ్చి కొత్తగా రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రతిపాదనలు ఉన్నాయి. ఉన్నతాధికారుల సూచనల మేరకు, ప్రజల విజ్ఞప్తి మేరకు రహదారులు నిర్మిస్తాం. ప్రధాన ప్రాంతాల్లోని రోడ్లు అత్యవసరంగా నిర్మించాలని స్థానికులు ఫిర్యాదులు చేశారు. ఇక వర్షం పడితే ప్రజల రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమే.

- రాజశేఖర్, నగరపాలక సంస్థ ఎస్ఈ

హత్యాయత్నం కేసులో ఐదుగురి అరెస్టు

బుక్కరాయసముద్రం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): అనంతపురం పట్టణ శివారు ప్రాంతంలోని తడకలేరు బ్రిడ్జి సమీపంలో ఇటీవల మామ, అల్లుడి మధ్య జరిగిన ఘర్షణలో పదిమందిపై హత్యాయత్నం కేసు నమోదు చేశామని, అందులో ఐదుగురిని అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్‌కు పంపామని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు తెలిపారు. మండల కేంద్రంలోని అప్‌గ్రేడ్ పోలీసు స్టేషన్‌లో బుధవారం ఆయన సీఐ పుల్లయ్య, ఎస్ఐ రామప్రసాద్‌తో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఈ ఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. అనంతపురం ఓల్డ్‌టౌన్ బిందెల కాలనీకి చెందిన తాటికొండ నాగరాజు, అతడి అల్లుడు మహేష్ మధ్య గతంలో బుక్కరాయసముద్రంలోని బీజేపీ కాలనీలో ఇంటి స్థలంపై వివాదం ఉండేది. ఈ విషయంలో గతంలో ఇరువురి మధ్య గొడవ జరిగింది. ఇది మనసులో పెట్టుకున్న మహేష్ ఈ నెల18న తడకలేరు వద్ద ఉన్న నయారా పెట్రోల్ బంకులో మామ నాగరాజుపై దాడి చేసి గాయపరిచాడు. విషయం తెలుసుకున్న నాగరాజు కుమారులు, బంధువులు పది మంది దాకా వెంటనే వచ్చి మహేష్‌పై రాళ్లతో దాడి గాయపరిచారు. గాయపడిన మహేష్, నాగరాజులు అనంతపురం సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇందులో మహేష్ పరిస్థితి కొంత విషమంగా ఉన్నట్లు తెలిపారు. మహేష్‌పై దాడి చేసిన ఘటనలో పది మందిపై కేసు నమోదు చేయగా వారిలో ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్ పంపినట్లు చెప్పారు. మరో ఐదుగురిని త్వరలోనే అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరచనున్నట్లు తెలిపారు. నాగరాజుపై దాడిచేసిన ఘటనలో మహేష్‌పై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

గ్యాంగ్ వార్ అని వైరల్ చేస్తే చర్యలు..

స్థల వివాదం కారణం, గతంలో మామ, అల్లుడు మధ్య మనస్పర్థల వల్ల జరిగిన గొడవను కొంత మంది సోషల్ మీడియాలో గ్యాంగ్ వార్ అని వైరల్ చేస్తున్నారని, అలా చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ ఘర్షణ బంధువుల మధ్య ఉన్న విభేదాల వలన జరిగిన ఘటన అని తెలియజేశారు. సామాజిక మాధ్యమాలలో పోస్టు పెట్టేప్పుడు వాస్తవాలను పరిశీలించాలని సూచించారు.

మహాసభకు తరలిరండి

అనంతపురం అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని లలితకళాపరిషత్‌లో ఈనెల 31వ తేదీన నిర్వహించే ఓసీ విద్యార్థి యువగర్జన మహాసభకు విద్యార్థులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఓసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి జయవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం లలితకళాపరిషత్‌లో పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఓసీల్లో కూడా పేదలు ఉన్నారని, అన్ని రంగాల్లో అణిచివేతకు గురవుతున్న ఓసీ విద్యార్థులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంజునాథ్ చౌదరి, నాయకులు మాధవ రెడ్డి, ఓబిరెడ్డి, ఆదికేశవరెడ్డి, ప్రభా ష్‌రెడ్డి, సాయి, కిషోర్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరు చెరువుకు ఎమ్మెల్యే గంగపూజ


చెరువు వద్ద జలహారతి ఇస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురంరూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలమూరు చెరువు రెండురోజుల కిందట మరువ పారింది. దీంతో ఆ చెరువును ఎమ్మెల్యే పరిటాల సునీత బుధవారం సాయంత్రం పరిశీలించారు. గంగపూజ నిర్వహించి, జలహారతి ఇచ్చారు. గంగమ్మ తల్లికి సారె సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. రాప్తాడు నియోజకవర్గంలో ప్రతి చెరువును హంద్రీ నీవా నీటితో నింపాలన్నదే తమ లక్ష్యమని తెలిపారు. నియోజకవర్గానికి హంద్రీనీవా నీరు రాదని వైసీపీ నాయకులు దుష్ప్రచారం చేశారన్నారు. ఇప్పుడు గతం కంటే ఎక్కువగా చెరువులకు నీరు అందుతోందని అన్నారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు దుష్ప్రచారం మానాలన్నారు. తొలుత గ్రామస్థులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ఆలమూరు సూరి, నాగేంద్రరెడ్డి, సంజీవులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ హేమలతపై తీవ్ర అసమ్మతి

● సభ్యుల గైర్హాజరుతో మళ్లీ వాయిదా పడిన సమావేశం

ఆత్మకూరు అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలపరిషత్ అధ్యక్షురాలు హేమలతపై వైసీపీ ఎంపీటీసీ సభ్యుల అసమ్మతి తారాస్థాయికి చేరింది. దీంతో మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం రెండో రోజు నిర్వహించిన మండల సర్వసభ్యసమావేశానికి ఒక్క ప్రజా ప్రతినిధి కూడా హాజరుకాలేదు. దీంతో ఎంపీడీఓ లక్ష్మీనరసింహ సమావేశాన్ని నిరవధికంగా మళ్లీ వాయిదా వేశారు. సమావేశానికి కనీసం కోరం సభ్యులు కూడా హాజరు కాలేదు. మండలంలో 11ఎంపీటీసీ స్థానాల్లో ముట్టాల ఎంపీటీసీ స్థానాన్ని టీడీపీ అభ్యర్థి పారిజాతమ్మ గెలుపొందారు. మిగిలిన పది స్థానాల్లో టీడీపీ ఎన్నిక బహిష్కరించడంతో పోటీజరగలేదు. పోటీలేకుండా ఎన్నికయిన వైసీపీ సభ్యులకు మొదటి నుంచి ఎంపీపీ కనీస గౌరవం ఇవ్వలేదని, దీంతో అప్పటి నుంచే అసమ్మతి ప్రారంభమైందని తెలుస్తోంది. ఈ ఆవేదనతోనే సభ్యులు మొహం చాటేశారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పారిశుధ్య సమస్యలు లేకుండా చూడాలి: డీపీఓ

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కురుస్తున్న వర్షాలను దృష్టిలో ఉంచుకుని ఎక్కడా పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలని డీపీఓ నాగరాజనాయుడు సిబ్బందిని ఆదేశించారు. పారిశుధ్య పనుల తనిఖీల్లో భాగంగా బుధవారం ఆయన బుక్కరాయసముద్రం మండలం కేకే అగ్రహారంలో పర్యటించారు. అక్కడ ఇంటింటి చెత్త సేకరణ అమలుపై గ్రామస్థులనడిగి తెలుసుకున్నారు. ఎక్కడ పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలని డిప్యూటీ ఎంపీడీఓ సదాశివను ఆదేశించారు. అనంతరం స్వమిత్ర నిర్వహణపై ఆరా తీశారు.

జ్యూస్ దుకాణం నిర్వాహకులపై కేసు నమోదు

అనంతపురం వైద్యం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): సాయినగర్‌లోని లస్సీడే జ్యూస్ దుకాణం నిర్వాహకులపై కేసు నమోదు చేశామని అనంతపురం డివిజన్-1 ఫుడ్ సేఫ్టీ అధికారి తస్లీం తెలిపారు. బుధవారం నిర్వహించిన తనిఖీల్లో భాగంగా లస్సీడే జ్యూస్ దుకాణాన్ని తనిఖీ చేశామని, అందులో గడువు ముగిసిన ఆహార పదార్థాలను ఫ్రిజ్‌లో నిల్వవుంచడాన్ని గుర్తించామని తెలిపారు. అలాగే జ్యూస్‌ల తయారీలోకి కుళ్లిపోయిన పండ్లు వాడకాన్ని గుర్తించామని, ఇందుకుగాను దుకాణం నిర్వాహకులపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

నార్పల, పుట్లూరు సొసైటీలకు కమిటీల నియామకం

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రెండు సహకార సొసైటీలకు కమిటీలను నియమిస్తూ రాష్ట్ర సహకార శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ బుధవారం జీఓ నంబరు 921ను జారీ చేశారు. నార్పల సొసైటీకి ఛైర్మన్‌గా నల్లబోతుల మహేష్‌నాయుడు, డైరెక్టర్లుగా కుల్లాయిరెడ్డి, గంజికుంట రామకృష్ణను నియమించారు. పుట్లూరు సొసైటీ ఛైర్మన్‌గా గోవర్ధన్‌రాజు, డైరెక్టర్లుగా వైకుంఠం శ్రీనాథ్‌చౌదరి, కాయపాటి అంజనేయులును నియమించారు. 2026 జనవరి 30వతేదీ వరకు ఈ కమిటీలు కొనసాగుతాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కిమ్స్ సవీరాలో అరుదైన శస్త్రచికిత్స



శస్త్రచికిత్స చేయించుకున్న యువతితో కలిసి వివరాలు తెలుపుతున్న డాక్టర్ మహ్మద్ షాహిద్

అనంతపురం వైద్యం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కిమ్స్ సవీరా ఆస్పత్రిలో దీర్ఘకాలిక పాంక్రియాటైటిస్‌కు 'లాటరల్ ప్యాంక్రియాటి కోజెజునొస్టొమీ(ఎల్‌జేపీ)' అనే అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా చేశారు. ఈ మేరకు సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ మహ్మద్ షాహిద్ బుధవారం శస్త్రచికిత్స వివరాలను వెల్లడించారు. 17 ఏళ్ల యువతి కడుపునొప్పితో బాధపడుతూ ఆస్పత్రిలో అడ్మిట్ అయిందన్నారు. పరీక్షలు నిర్వహించి ఆమె క్లోమం(ప్యాంక్రియాస్)లో రాళ్లు ఏర్పడినట్లు గుర్తించామన్నారు. వెంటనే శస్త్రచికిత్స ద్వారా క్లోమాన్ని కట్ చేసి అందులోని మొత్తం రాళ్లను తొలగించామని చెప్పారు. అనంతరం చిన్నపేగులో కొంత భాగాన్ని తీసుకుని క్లోమంతో కలిపి కుట్టు వేశామన్నారు. ప్రస్తుతం యువతి ఆరోగ్యంగా ఉందన్నారు. మూడు లక్షలమందిలో ఒకరు మాత్రమే ఇలాంటి వ్యాధికి గురవుతారని తెలిపారు.

పాపంపేట భూవివాదంపై సమగ్ర విచారణ జరపాలి


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి

అనంతపురం విద్య, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): అనంతపురం రూరల్ మండలం పాపంపేట భూవివాదంపై సమగ్ర విచారణ జరపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాళ్యం నారాయణస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు పలువురు సీపీఐ నాయకులు పాపంపేటకు వెళ్లి సమస్యను పరిశీలించి బాధితులను పలు వివరాలడిగి తెలుసుకున్నారు. అనంతరం నారాయణస్వామి మాట్లాడుతూ దశాబ్దాలుగా ఇక్కడ ప్రభుత్వ నిబంధనల మేరకు భూములు రిజిస్టర్లు జరుగుతూ వస్తున్నాయన్నారు. ఇప్పుడు కొందరు ఈ భూములు శోత్రియం భూములని, ఇవన్నీ తమకు చెందినవిగా కోర్టుతీర్పులు ఉన్నాయని చెబుతూ వేలాది మంది కుటుంబాలను భయభ్రాంతులకు గురిచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వం స్పందించి ఇక్కడి ప్రజలకు న్యాయం చేయాలన్నారు. లేకపోతే సీపీఐ పెద్దఎత్తున ఉద్యమాలు చేపడుతుందని హెచ్చరించారు. త్వరలో సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ జిల్లాకు వచ్చి పాపంపేట బాధితులకు అండగా నిలబడుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, సంతోష్,కృష్ణుడు, దుర్గాప్రసాద్, రామాంజి, ఆనంద్ పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై పోరాటాలకు సిద్ధం కండి

బుక్కరాయసముద్రం: ప్రజాసమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాళ్యం నారాయణస్వామి పిలుపునిచ్చారు. అనంతపురంలోని నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో సీపీఐ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఇందులో నాయకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై చేయాల్సిన పోరాటాల గురించి చర్చించారు. అనంతరం నారాయణ స్వామి మాట్లాడుతూ.. వచ్చే స్థానిక సంస్థగత ఎన్నికలలో అన్ని గ్రామ పంచాయతీలలో సీపీఐ పోటీ చేస్తుందని తెలిపారు. ఏ పార్టీకి మద్దతు లేకుండా స్వతంత్రంగా పోటీ చేస్తామన్నారు. ప్రజా పోరాటాలకు పార్టీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి టీ నారాయణస్వామి, సహాయ కార్యదర్శి చెన్నప్ప యాదవ్, మండల కార్యదర్శులు రామక్రిష్ణ, పెద్దయ్య, మధుయాదవ్, నాగార్జునతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలకు పుస్తకాలు

అనంతపురం టౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ద్విభాషా కవి డాక్టర్ జూటూరు షరీఫ్ తాను రచించిన 'చెట్టు' వచన కవిత్వ పుస్తకాలను పలు గ్రంథాలయాలకు ఉచితంగా అందజేశారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంతో పాటు మహిళా, బాలల గ్రంథాలయాలకు బుధవారం ఆయన నేరుగా వెళ్లి పుస్తకాలను అందజేశారు. ఇందుకు రిటైర్డ్ హెచ్‌ఎం రియాజుద్దీన్ అహ్మద్, డిప్యూటీ లైబ్రేరియన్ కమ్మన్న, అసిస్టెంట్ లైబ్రేరియన్ గోవిందు, మహిళా గ్రంథాలయం అధికారి శ్రీపతి ఆయన్ను అభినందించారు. ఈ సందర్భంగా రియాజుద్దీన్ అహ్మద్ మాట్లాడుతూ... రాయలసీమ ఆధునిక సాహిత్యంలో వచన శతకం రాసిన తొలి కవి డాక్టర్ జూటూరు షరీఫ్ అని పేర్కొన్నారు. ఆయన రచించిన 'చెట్టు' వచన శతకం ఎంతో వినూత్నమైందన్నారు. తన కావ్యం ద్వారా ప్రజల్లో పర్యావరణ చైతన్యాన్ని నింపారని తెలిపారు. సాహిత్య భారతి వ్యవస్థాపకుడు మురళీకృష్ణ, గ్రంథాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ పేరిట నకిలీ ఫేస్‌బుక్ ఖాతా

రామగిరి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి):రామగిరి ఎస్ఐ సుధాకర్ యాదవ్ పేరుమీదుగా గుర్తుతెలియని వ్యక్తి నకిలీ ఫేస్‌బుక్ అకౌంట్ సృష్టించినట్టు తెలిసిందని రామగిరి పోలీసులు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఆ ఖాతా ద్వారా ఫ్రెండ్‌రిక్వెస్ట్‌లు పంపించడం, అపోహలు సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఆ ఫేస్ బుక్ ఖాతాకు ఎస్ఐ సుధాకర్ యాదవ్‌కు ఎటువంటి సంబంధం లేదన్నారు. ఆ ఖాతా నుంచి వచ్చే సందేశాలను ఎవరూ నమ్మవద్దని సూచించారు.

మెప్మా అధికారి బాధ్యతల స్వీకరణ

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ మెప్మా ప్రాజెక్ట్ అధికారిగా నాగ సుబ్బరాయుడు బాధ్యతలు స్వీకరించారు. రాయదుర్గం మున్సిపాలిటీలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో గ్రేడ్-2 టౌన్ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న నాగసుబ్బరాయుడుకు గ్రేడ్-1 టీపీఆర్‌ఓగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ అనంత నగరపాలక సంస్థకు బదిలీ చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు బుధవారం ఆయన నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామికి కలిసి బాధ్యతలు చేపట్టారు.

పప్పుశనగను పంపిణీ చేయకపోవడం దారుణం

అనంతపురం అర్బన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నల్లరేగడి రైతులకు సబ్సిడీతో పప్పుశనగ విత్తనాలు పంపిణీ చేయకపోవడం దారుణమని ఏపీ రైతు సంఘం నాయకులు మండిపడ్డారు. ఈ మేరకు నగరంలోని జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం ఎదుట బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. గత ఏడాది అక్టోబరు రెండో వారం నుంచే సబ్సిడీతో పప్పుశనగ విత్తనాలు పంపిణీ చేశారన్నారు. ఈ ఏడాది రబీ సీజన్ ఆరంభమై 22 రోజులు కావస్తున్నా సబ్సిడీ విత్తన పంపిణీపై దృష్టి సారించకపోవడం ఏమిటో అర్థం కావడం లేదన్నారు. 90 శాతం సబ్సిడీతో పప్పుశనగ విత్తనాలు తక్షణమే పంపిణీ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మునీర్ అహ్మద్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రామిరెడ్డి, కృష్ణమూర్తి, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ శిబిరాలు

రామగిరి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం నుంచి మొబైల్ ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు ఎంపీడీఓ గంగావతి బుధవారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో 5 నుంచి 15 ఏళ్ల వయసులోపు పిల్లల ఆధార్‌ను అప్‌డేట్ చేసుకునేందుకు ఈ కేంద్రాలు ఉపయోగపడతాయన్నారు. 23, 24వ తేదీల్లో పేరూరు, కుంటిమద్ది ఉన్నతపాఠశాలల్లో, 25, 27న పేరూరులోని ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాల, రామగిరిలోని మోడల్ స్కూల్లో, 28,29వ తేదీల్లో రామగిరిలోని కేజీబీవీ, నసనకోట జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో, 30న నసనకోట బాలికల గురుకుల పాఠశాల, పోలేపల్లి ఉన్నతపాఠశాలలో ఈ క్యాంపులు నిర్వహించనున్నట్లు చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

స్కానింగ్ సెంటర్లపై నిరంతరం నిఘా ఉంచాలి: ఆర్డీఓ


అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీఓ

అనంతపురం వైద్యం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గర్భస్థ లింగ నిర్ధారణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తూ స్కానింగ్ సెంటర్లపై నిరంతర నిఘా పెట్టాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు ఆర్డీఓ కేశవనాయుడు ఆదేశించారు. నగరంలోని తన కార్యాలయంలో బుధవారం ఆయన పీసీ అండ్ పీఎన్డీటీ యాక్టు అమలుపై సమీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్కానింగ్ సెంటర్లలో డాక్టర్ రిక్విజేషన్ లేకున్నా, నిబంధనలు పాటించకున్నా తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఐసీడీఎస్, వైద్యశాఖ సంయుక్తంగా పని చేస్తూ బాల్య వివాహాలపై ఇంటింటికీ అవగాహన కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్వజన వైద్యశాల పీడియాట్రిక్స్ హెచ్ఓడీ డాక్టర్ రవికుమార్, గైనకాలజిస్ట్ డాక్టర్ రేణుక, పేథాలజిస్ట్ డాక్టర్ శ్రీధర్, సీఐ శాంతిలాల్ పాల్గొన్నారు.

నేడు ఆధార్ కేంద్రాల నిర్వహణ

రాయదుర్గంరూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని టీ వీరాపురం, చదంగొల్లలదొడ్డి ఉన్నత పాఠశాలల్లో గురువారం ఆధార్ కేంద్రాలను నిర్వహిస్తున్నామని ఎంఈఓ 2 వెంకట రమేష్ బుధవారం పేర్కొన్నారు. విద్యార్థుల ఆధార్ అప్‌డేట్, చేర్పులు, మార్పుల కోసం ఈ రెండు పాఠశాలలో ఆధార్ కేంద్రాలను ఒక్క రోజు మాత్రమే ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆగిన కైరేవు రోడ్డు నిర్మాణం

ఇబ్బందులు పడుతున్న గ్రామస్థులు

శెట్టూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): శెట్టూరు నుంచి కైరేవు మీదుగా చెర్లపల్లికి వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణ పనులు ఆగిపోవడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడేళ్ల కిత్రం నాటి వైసీపీ ప్రభుత్వం చేపట్టిన ఈ పనులకు నిధులు కేటాయించకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. మొత్తం ఆరు కిలోమీటర్లకు గాను కొంత వరకు కంకర వేసి.. మరికొంత వరకు మట్టి పోసి.. ఇక చాలా వరకు అలాగే వదిలేశారు. దీంతో పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. కనీసం ఆటో కూడా రావడం లేదు. దీంతో ఎదైనా అత్యవసర పరిస్థితుల్లో బైక్‌లపైనే ఆ గతుకుల రోడ్డులో వెళ్లాల్సి వస్తోంది. ఇక వర్షం వచ్చిందంటే పరిస్థితి మరీ ఘోరం. అనేక మంది ద్విచక్రవాహనదారులు కిందపడి ఆస్పత్రుల పాలయ్యారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఈ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని ఆ గ్రామ ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కరించాలి



ప్రభుత్వాలు మారినా ఈ రోడ్డు సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. నాయకులు రోడ్డు వేస్తామని మాటలకే పరిమితం అవుతున్నారు. ఇప్పటికైనా స్పందించి ఈ రోడ్డును తొందరగా వేసేలా చర్యలు తీసుకోవాలి.

\- ప్రతాప్, కైరేవు

ఆస్పత్రికీ వెళ్లలేం



కైరేవు గ్రామం నుంచి శెట్టూరు వెళ్లాలంటే నరకమే. కనీసం ఆటోలు కూడా రావడం లేదు. గర్భవతులు, రోగులను ఆస్పత్రి తీసుకువెళ్లాలంటే బైక్‌లపైనే తీసుకెళ్లాల్సిన దుస్థితి ఉంది. రోడ్డు సక్రమంగా లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం.

\- సిద్దప్ప, కైరేవు



కైరేవు నుంచి చెర్లోపల్లి వెళ్లే రహదారి

పోగొట్టుకున్న సొమ్ము అప్పగింత



బాధితురాలికి నగదు అందజేస్తున్న పోలీసులు

కణేకల్లు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపులాపురానికి చెందిన గీతమ్మ ఈ నెల 17న కణేకల్లులో ఇతరుల దగ్గర రూ. 22 వేలు అప్పుగా తీసుకుంది. అదే రోజు సాయంత్రం నగదుతో ఆమె గోపులాపురానికి వెళుతుండగా కణేకల్లు క్రాస్ వద్ద నగదుతో పాటు ఏటీఎం కార్డు, బ్యాంక్ పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు పోగొట్టుకుంది. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ఆ ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా.. ఆ నగదు కణేకల్లుకు చెందిన ఓ మహిళకు దొరికినట్లు గుర్తించారు. ఆమె నుంచి ఆ డబ్బు, వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకొని.. గీతమ్మను బుధవారం అందజేశారు. దీంతో గీతమ్మ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇద్దరు యువకులపై దాడి

గుంతకల్లుటౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక భాగ్యనగర్‌కు చెందిన ప్రశాంత్ నాలుగు నెలల క్రితం స్థానిక రాజ్‌విహార్ లాడ్జ్‌లో ఓ రూం తీసుకున్నాడు. రూం బీగాలు ఇవ్వకుండా ప్రశాంత్ వెళ్లిపోయాడు. బుధవారం మధ్యాహ్నం స్థానిక బళ్లారి సర్కిల్‌లోని విశాల్ మార్ట్ వద్ద ఉన్న ప్రశాంత్, అతని స్నేహితుడు దిలీప్‌కుమార్‌ను రూం బీగాలు విషయమై తాహేర్, జిలాన్, రామాంజి, కుళ్లాయప్ప ప్రశ్నించారు. మాటామాటా పెరగడంతో ప్రశాంత్, దిలీప్‌కుమార్‌పై ఆ నలుగురు కట్టెలు, రాడ్‌లతో దాడి చేశారు. ఆ ఇరువురి తలకు గాయాలయ్యాయి. వారిని స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు విచారణ చేపట్టారు.

పశువైద్యశాలలో అగ్నిప్రమాదం



ఆహుతైన మందులు, ఫర్నీచర్

పెద్దవడుగూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కిష్టిపాడు గ్రామంలోని పశువైద్యశాలలో బుధవారం తెల్లవారుజామున మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది గ్రామస్థుల సహకారంతో ఆ మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో స్టోర్‌రూములోని మెడిసిన్స్, పరికరాలు, తలుపులు, కిటికీలు పూర్తిగా కాలిపోయినట్లు పశువైద్యాధికారి కమల తెలిపారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. ఈ సంఘటనపై స్థానిక డాక్టర్ ఫిర్యాదు చేసినట్లు ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ భారతి తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

జూదరుల అరెస్ట్

తాడిపత్రి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక యల్లనూరురోడ్డులోని వివేకానంద స్కూల్ సమీపంలో ఒక ఇంటిలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ ఆరోహణరావు, ఎస్ఐ గౌస్ బాషా బుధవారం తెలిపారు. వారి నుంచి రూ.16,300 స్వాధీనం చేసుకున్నామన్నారు.

మద్యం స్వాధీనం

తాడిపత్రి, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): మండలంలోని భోగసముద్రంలో అయ్యవారిపల్లిలో ఓ వ్యక్తి నిర్వహిస్తున్న బెల్ట్‌షాప్‌పై బుధవారం దాడి చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. అతని వద్ద నుంచి 34 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని, నిందితుడిపై కేసు నమోదు చేశామని చెప్పారు.

వైసీపీ హయాంలో మీ సంఘం ఏమైంది?

పోలీసు సంఘం జిల్లా అధ్యక్షుడిపై తాడిపత్రి మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆగ్రహం

తాడిపత్రి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో నాటి పాలకులు పోలీసులను ఎంత నీచంగా మాట్లాడినా నోరెత్తని పోలీసు సంఘం జిల్లా అధ్యక్షుడు త్రిలోకనాథ్... నేడు ప్రెస్‌మీట్ పెట్టి పోలీసుల సంరక్షణ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని మున్సిపల్ వైస్‌చైర్మన్ షెక్షావలి, కౌన్సిలర్ మల్లికార్జున మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే నివాసంలో బుధవారం వారు మీడియాతో మాట్లాడారు. 'త్రిలోకనాథ్ .... వైసీపీ ప్రభుత్వంలో ప్రకాష్ ఏఆర్ కానిస్టేబుల్ టీపీ, డీఏల గురించి.. సరెండర్ గురించి అడిగినందుకు డిస్మిస్ చేశారు. అప్పుడు మీ పోలీసు అధికారుల సంఘం ఏమైంది. కడప ఇంటలిజెన్స్ సీఐ మీద దాడిచేసినపుడు మీ సంఘం ఎక్కడికి వెళ్లింది. మాజీ మంత్రి రోజా సీఐని చెప్పుతో కొడతా అంటే ఏమైంది మీ పోలీసు సంఘం. అప్పుడు ఎందుకు ప్రెస్‌మీట్ పెట్టలేదు. కేవలం తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మాత్రమే ప్రెస్‌మీట్లు పెడతావా..? గత ప్రభుత్వంలో ఎప్పుడైనా ప్రెస్‌మీట్ పెట్టావా.. మీకు జగన్‌మోహన్‌రెడ్డి అంటే అంత భయమా లేక భక్తా...? అసలు నీ పోలీసు అధికార సంఘానికి రిజిస్ట్రేషన్ ఉందా. ఉంటే దాన్ని పత్రికాముఖంగా తెలియజేయండి. 30 సంవత్సరాల నుంచి అనంతపురం పట్టణ పరిసరాల్లోనే పనిచేస్తున్నారు. ఏరోజైనా యూనిఫాం వేసుకొని డ్యూటీ చేశావా..? తిరుపతికి బదిలీ అయితే అనంతపురంలోనే ఎస్పీ ఆఫీసు వద్ద ఉంటూ టైం పాస్ చేసుకొంటూ తిరుగుతున్నావు. ఏ.. నీకు రూల్స్ వర్తించవా. ఏఎస్పీ రోహిత్‌కుమార్... మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఎందుకు క్షమాపణ చెప్పాలి. ఆయన కాళ్లు విరగ్గొడతాం.. గన్నుతో కాలుస్తాం.. అంటే మేం గాజులు తొడుక్కొని ఉండాలా..? గత ప్రభుత్వంలో మేం పోలీసులతో కొట్టించుకొని అక్రమ కేసులు పెట్టించుకొని జైలు పాలయ్యాం. ఇప్పుడు కూడా ఏఎస్పీ ఇష్టం వచ్చినట్లు అక్రమ కేసులు పెడుతుంటే ఊరుకోవాలా..? యాడికి మండలం వెంగన్నపల్లిలో తెలుగుదేశం కార్యకర్తపై వైసీపీ వారు దాడిచేసి గాయపరిస్తే ఈరోజు వరకు వారిని అరెస్ట్ కూడా చేయలేదు. పైగా పదిరోజుల తర్వాత ఏఎస్పీ ప్రత్యేక చొరవ తీసుకొని బాధితులపైనే రేప్ కేస్ నమోదు చేయించారు. అసలు ఎటువంటి వైద్యపరీక్షలూ చేయకుండానే రేప్ కేస్ ఎలా పెట్టారు..? అనంత వెంకటరామిరెడ్డి.. మీ వైసీపీ నాయకుల దౌర్జన్యాలు.. తాడిపత్రిలో అప్పటి డీఎస్పీ చైతన్య అరాచకాలు నీకు కనబడలేదా..? ఈరోజు నీకు రాజ్యాంగం గుర్తుకు వస్తోందా...? మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి తాడిపత్రిలో అన్ని అరాచకాలు చేసినప్పుడు ఒకరోజు కూడా ప్రెస్‌మీట్ పెట్టి ఖండించలేదే. పెద్దారెడ్డి అంటే నీకు భయమా..? కూటమి ప్రభుత్వంలో శాంతిభద్రతలు కఠినంగా ఉన్నాయి కాబట్టే మీరంతా ఇలా స్వేచ్ఛగా మాట్లాడుతున్నారు' అని అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైస్‌చైర్మన్, నాయకులు

మంత్రికి పంచాయతీ కార్యదర్శుల సన్మానం



మంత్రిని సన్మానిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

విడపనకల్లు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శి పేరును పంచాయతీ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా మార్పు చేస్తూ క్యాబినెట్ తీర్మాణం చేయటంపై మండల పంచాయతీ కార్యదర్శులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను మండలంలోని పాల్తూరు గ్రామంలో బుధవారం వారు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యబాబు, ఏఓ భాస్కర్ బాబు, పంచాయతీ కార్యదర్శులు మునాఫ్, లోకేష్, మహేష్, నాగభూషణం పాల్గొన్నారు.

రైతులకు వాన గుబులు



శ్రీధరఘట్టలో మొక్కజొన్న పంటలో నిలిచిన నీరు

బొమ్మనహాళ్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెండు రోజులుగా తుపాన్ ప్రభావంతో వర్షాలు పడుతుండటంతో పంటలు దెబ్బతినే అవకాశముందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వరి పంటపై పెద్దగా ప్రభవం లేకపోయినా.. మొక్కజొన్న, బంతిపూలు, మిరప పంటలు సాగు చేసిన రైతులు ఆందోళనలో ఉన్నారు. పొలాలు నీట మునిగిపోయి మొక్కలు కుళ్లిపోతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం తగ్గిన వెంటనే పొలాల్లో నీరు బయటకు తరలించేలా రైతులు చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారి సాయికుమార్ సూచించారు.

బళ్లారి దుర్గమ్మకు పూజలు



దుర్గాదేవి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న భక్తులు

బెళుగుప్ప, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని బెళుగుప్ప తండాలో దీపావళి ఉత్సవాలను మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. చివరి రోజైన బుధవారం వారి ఆరాధ్యదేవత బళ్లారి దుర్గా దేవికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి చిత్రపటాన్ని గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో ఊరేగించారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

కణేకల్లు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఎంసీ సర్మాస్‌వలి కుటుంబానికి సీఎం సహాయనిధి కింద రూ. 2.12 లక్షలు మంజూరైంది. ఆ చెక్కును ఎంసీ సర్మాస్ కుమారుడు వలికి విప్ కాలవ శ్రీనివాసులు బుధవారం అందజేశారు. ఇందులో టీడీపీ నాయకులు లాలెప్ప, ఆనంద్‌రాజ్, బీటీ రమేష్, చాంద్‌బాషా, ఎస్‌కే మల్లికార్జున పాల్గొన్నారు.

● రాయదుర్గంరూరల్ : మండలంలోని కదరంపల్లి గ్రామానికి చెందిన తగ్గుపర్తి భానుకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ. 2 లక్షలు మంజూరైంది. ఆ చెక్కును విప్ కాలవ బుధవారం వారికి అందజేశారు. ఇందులో టీడీపీ మండల కన్వీనర్ కురుబ హనుమంతు, నాయకుడు సోమశేఖర్ పాల్గొన్నారు.



వలికి చెక్ అందిస్తున్న విప్ కాలవ



అధికారులకు వినతి పత్రం ఇస్తున్న రైతులు

చెరువులకు హెచ్చెల్సీ నీరివ్వండి

పుట్లూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పుట్లూరు, గరుగుచింతలపల్లి, కోమటికుంట్ల చెరువులకు సుబ్బరాయసాగర్ డ్యాం నుంచి హెచ్చెల్సీ నీరు విడుదల చేయాలని ఆ గ్రామాల రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ మేరకు అనంతపురంలోని హెచ్చెల్సీ కార్యాలయంలో బుధవారం అధికారులకు వినతి పత్రం అందజేశారు. డ్యాంలోకి నీరు చేరిన వెంటనే విడుదల చేయాలని, ఈ మూడు చెరువులకు నీరు ఇస్తే తాగునీటి సమస్య ఉండదని తెలిపారు. అధికారులను కలిసిన వారిలో రైతులు, టీడీపీ నాయకులు కులశేఖర్‌రెడ్డి, శివారెడ్డి, జయచంద్రారెడ్డి ఉన్నారు.

రిలే దీక్షలకు సంఘీభావం

గుంతకల్లు టౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కార్పొరేట్ సెలూన్ షాపులను తొలగించాలని స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద క్షవర వృతిదారులు చేపట్టిన రిలే దీక్షలకు సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ డివిజన్ కార్యదర్శి బీ సురేష్ బుధవారం సంఘీభావం తెలిపారు. ఈ దీక్షల్లో ఆ సంఘం పట్టణ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్యదర్శి సూరి, కోశాధికారి బ్రహ్మ, నాయకులు శంకర్, వాసు, మధు, నీలా, శివ, అంజి, బాల, నవీన్, ఆ పార్టీ నాయకులు రఘునాథ్‌రెడ్డి, జిలాన్, రామాంజినేయులు, రామదాస్, విశ్వనాథ్, నారాయణ పాల్గొన్నారు.

జడ్పీ పాఠశాలలో టాలెంట్ టెస్ట్

కుందుర్పి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని అపిలేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు చెకుముకి టాలెంట్ టెస్ట్ బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు తిమ్మప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణకు నేడే ఆఖరు

గుత్తి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని అనధికార లేఅవుట్‌లలో ప్లాట్ కొనుగోలు చేసిన వారు ఎల్ఆర్ఎస్ ద్వారా రెగ్యులరైజ్ చేసుకునేందుకు గురువారంతో సమయం ముగిస్తుందని మున్సిపల్ కమిషనర్ జబ్బర్ మీయా తెలిపారు. ప్లాట్ల యాజమానులు రెగ్యులర్ చేసుకోవడం ద్వారా 14 శాతం ఓపెన్ స్పెస్ చార్జస్‌లో 50 శాతం రాయితీ పొందవచ్చునన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పుట్లూరు సొసైటీ కార్యవర్గం నియామకం

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): పుట్లూరు సహకార సొసైటీని నియమిస్తూ రాష్ట్ర సహకార శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ బుధవారం జారీ చేశారు. పుట్లూరు సొసైటీ చైర్మన్‌గా గోవర్ధన్‌రాజు, డైరెక్టర్లుగా వైకుంఠం శ్రీనాథ్‌చౌదరి, కాయపాటి ఆంజనేయులును నియమించారు. 2026 జనవరి 30వ తేదీ వరకు ఈ కమిటీ కొనసాగుతుందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కంపచెట్ల తొలగింపు

బొమ్మనహాళ్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు నుంచి హీర్దేహాళ్ గ్రామానికి వెళ్లి రోడ్డుకు ఇరుపక్కలా భారీగా కంపచెట్లు పెరిగాయి. దీంతో రోడ్డు మలుపు ప్రాంతాల్లో ఎదురుగా వచ్చే వాహనం కనిపించక.. ప్రమాదాలు జరిగేవి. దీంతో నేమకల్లుకు చెందిన టీడీపీ నాయకుడు గాలిబసప్ప సొంత డబ్బులతో ఆ కంపచెట్లను బుధవారం తొలగించారు. గ్రామస్థులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.



కంపచెట్లను తొలగిస్తున్న దృశ్యం

అధికారులపై ట్రైనీ కలెక్టర్ ఆగ్రహం

బొమ్మనహాళ్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్గాహొన్నూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ట్రైనీ కలెక్టర్ సచిన్‌రోహర్ బుధవారం తనిఖీ చేశారు. అనంతరం గ్రామ సమీపంలోని ఇసుక దిబ్బలను పరిశీలించారు. కాగా, రాయదుర్గం నియోజకవర్గంలో ట్రైనీ కలెక్టర్ పర్యటిస్తున్నారని తెలిసినా బొమ్మనహాళ్ మండల స్థాయి అధికారులు అందుబాటులో లేకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇసుక దిబ్బల పరిస్థితులపై స్థానిక సమాచారం ఇవ్వాల్సిన ఉపాధి హామీ పథకం అధికారులూ లేకపోవడంపై ఆయన మండిపడ్డారు.

● రాయదుర్గంరూరల్: మండలంలోని రేకులకుంట గ్రామంలో ప్రభుత్వ పాఠశాలను ట్రైనీ కలెక్టర్ సచిన్ రాహర్ బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

నేడు క్రీడాపోటీలు

బొమ్మనహాళ్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రతిభా పాఠశాల మైదానంలో విద్యార్థులకు స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ క్రీడాపోటీలను గురువారం నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ మల్లికార్జున తెలిపారు. బుధవారం స్థానిక ఎంఆర్సీ కార్యాలయంలో పీఈటీ, ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని అండర్-14, అండర్-17 బాల, బాలికల విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహిస్తామని, మండలస్థాయిలో ఎంపికైన క్రీడాకారులను కళ్యాణదుర్గం డివిజన్ స్థాయిలో పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

● యాడికిలో రేపటి నుంచి..
యాడికి : యాడికి హైస్కూల్ మైదానంలో శుక్రవారం నుంచి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, చెస్, యోగ, అథ్లెటిక్స్ మండలస్థాయి పోటీలు నిర్వహిస్తామని ఎంఈఓ కాశప్ప తెలిపారు. పాల్గొనే విద్యార్థులు తగిన ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని తెలిపారు.

రికార్డుల తనిఖీ

బ్రహ్మసముద్రం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హెల్త్ మిషన్ జిల్లా కో ఆర్డినేటర్ కిషోర్ ఆధ్వర్యంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందంలోని సభ్యులు బ్రాహ్మసముద్రం మండలంలోని భైరసముద్రం సచివాలయానికి సంబంధించిన పలు రికార్డులను బుధవారం తనిఖీ చేశారు. ఆర్‌సీహెచ్ రికార్డులు, గర్భవతులు, చిన్నపిల్లలకు సంబంధించిన ఎంసీహెచ్ కార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఆఫ్తాబ్, జిల్లా టాస్క్ ఫోర్స్ టీం సభ్యులు డీపీహెచ్ఎస్ హేమలత, జరీనా, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాణి ఎస్తేర్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం

గుంతకల్లుటౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్‌జేపీ ఉన్నత పాఠశాలలో ఆడిటోరియం నిర్మాణానికి పాఠశాల పూర్వ విద్యార్థులు రూ.1.35లక్షలు వితరణ చేశారని పాఠశాల హెచ్‌ఎం కే మురళీకృష్ణ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఆడిటోరియం నిర్మాణానికి రూ.3 లక్షలు అవుతుందని, పాఠశాలలో ఉపాధ్యాయులు రూ. 75వేలు, పాఠశాల పూర్వవిద్యార్థులు రామ్మోహన్ గుప్త, వీరేష్‌కుమార్, శ్రీనివాసగుప్త, సురేష్ గుప్త, నారపరెడ్డి, తబిత, విశ్వేశ్వర రెడ్డి, శ్రీకాంత్ రూ. 1.35 లక్షలు అందజేశారని అన్నారు. ఆడిటోరియం నిర్మాణానికి పాఠశాల పూర్వవిద్యార్థులు ముందుకు రావాలని, వివరాలకు 94400 97753 నంబరులో సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గుంతకల్లుటౌన్, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని విద్యుత్ కార్మికులు స్థానిక ఆలూరు రోడ్డులోని విద్యుత్ ఏడీ కార్యాలయం వద్ద బుధవారం నిరసన తెలిపారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి సాకే నాగరాజు మాట్లాడుతూ.. ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు పెంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు జగదీష్, విద్యుత్ కార్మికులు ఎస్‌కేఎం బాషా, వన్నూరప్ప, నాగరాజు, అనిల్, రాజా, బోగేష్, జనప్ప పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

యాడికి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): బదిలీ ఉపాధ్యాయులను తక్షణమే రిలీవ్ చేయాలని ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి తెలిపారు. బుధవారం యాడికి మండలంలోని వివిధ పాఠశాలల్లో ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సమస్యల సేకరణ- సభ్యత స్వీకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. డీఎస్సీలో పాఠశాలల్లో చేరిన వారికి జీతాలు ఆలస్యం కాకుండా వెంటనే పొజిషన్ ఐడీలు కేటాయించి జీతాలు వెంటనే వచ్చేందుకు ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా ఆర్థిక కార్యదర్శి ప్రసాద్, జిల్లా కార్యదర్శి కేశవనాయుడు పాల్గొన్నారు.

● మండల కమిటీ ఎంపిక : ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షుడిగా నూర్ మహమ్మద్, ప్రధాన కార్యదర్శిగా రామాంజనేయులు, గౌరవ అధ్యక్షుడిగా జయప్రసాద్‌రావు, జిల్లా కౌన్సిలర్లుగా శ్రీనివాసయాదవ్, నబీరసూల్‌ను ఎన్నుకున్నారు.